## త్వరలో జాతీయ వైద్య మండలి సందర్శన


సమావేశంలో వైద్యులు

**నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే:** త్వరలో జాతీయ వైద్య మండలి(నేషనల్ మెడికల్ కౌన్సిల్) వైద్య కళాశాలను, జిల్లా ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేయనుందని, ఆ లోపు వైద్యులు తమ విభాగాల పరిధిలో రోగులకు అందిస్తున్న సేవలు, ఆపరేషన్లు, ఇతర సేవల సమాచారాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.సిద్ధానాయక్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గోవిందు సూచించారు. సోమవారం నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో అన్ని విభాగాల హెచ్‌వోడీలతో వారు సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఓపీల సంఖ్య పెరిగితే.. అదనంగా పీజీ సీట్లు వస్తాయన్నారు. ఎక్కువగా సెలవులు పెట్టవద్దని వైద్యులను కోరారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్ బాషా, అన్ని విభాగాల హెచ్‌వోడీలు, వైద్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నర్సుల ఎన్నికలు రేపు

**నెల్లూరు(జీజీహెచ్), న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా యూనిట్ ఎన్నికలు బుధవారం నగరంలోని జిల్లా ప్రభుత్వాసుపత్రి ఆవరణంలోని నర్సింగ్ కళాశాలలో జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న రెగ్యులర్ నర్సులు ఓటేయనున్నారు. గతంలో ఏకగ్రీవంగా జరిగేవి. ఈసారి గతంలో ఎన్నడూ లేని విధంగా రెండు ప్యానల్స్ తరఫున అభ్యర్థులు పోటీపడుతున్నారు. వరలక్ష్మి, సత్యవతి ప్యానెళ్లు పోటీలో ఉన్నాయి.

## వైకాపా నాయకుడి ఇష్టారాజ్యం..
# రోడ్డు ధ్వంసం

**అనుమసముద్రంపేట:** పొలాల్లోకి వెళ్లేందుకు రైతులు వేసుకున్న రోడ్డును వైకాపా నాయకులు రాత్రికి రాత్రే ధ్వంసం చేశారు. ఈ సంఘటన అనుమసముద్రంపేట మండలం గుడిపాడు రెవెన్యూ పరిధిలో ఇటీవల చోటుచేసుకోగా.. సోమవారం బాధిత రైతులు తహసీల్దారు శ్రీరామకృష్ణకు ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాల మేరకు గుడిపాడు నుంచి గుంపర్లపాడు వరకు అనాదిగా రోడ్డు ఉంది. గ్రామాల మధ్య పంటపొలాలు ఉన్నాయి. ఈ రోడ్డు వెళ్లే మార్గంలో గుడిపాడుకు చెందిన ఓ వైకాపా నాయకుడికి కొంత పట్టా పొలం ఉంది. దాంతో రోడ్డు అక్కడి వరకు ఆగింది. అవతలి వైపున్న పొలాలకు వెళ్లేందుకు దారి లేక రైతులు అవస్థ పడేవారు. పలుమార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించగా.. ఇటీవల స్పందించారు. సదరు వైకాపా నాయకుడి పట్టా భూమి కాకుండా.. ప్రభుత్వ భూమిని సర్వే చేసి రోడ్డు వేసుకునేందుకు అనుమతిచ్చారు. రైతులు నగదు వేసుకుని గ్రావెల్ రోడ్డు వేసుకున్నారు. అయిదు రోజుల కిందట వైకాపా నాయకుడితో పాటు మరికొందరు పొక్లెయిన్‌తో దాన్ని ధ్వంసం చేశారు. పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ.. సోమవారం తహసీల్దారు దృష్టికి తెచ్చారు. పశువులు నీళ్లు తాగే కుంటను, ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగుకు సిద్ధం చేసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తహసీల్దారు విచారణ చేయనున్నట్లు తెలిపారు.


ధ్వంసం చేసిన రోడ్డును చూపుతున్న రైతులు



రాపూరులోని స్టోన్ క్రషర్‌లో సీజ్ చేసిన కంకర

# కాజేస్తున్నా.. కనరంతే!

- సీజ్ చేసిన మైన్‌లో కంకర, యాష్ తరలింపు
- అధికారంలో లేకపోయినా.. ఆగని వైకాపా ఆగడాలు

ప్రభుత్వ భూమిలో అక్రమంగా తవ్వకాలు చేసినట్లు గుర్తించి.. వారికి రూ. 100 కోట్ల జరిమానా విధించారు. సదరు కంపెనీని సీజ్ చేశారు. కానీ, ఇవేమీ ఆ వైకాపా నాయకులకు పట్టడం లేదు. ఇంకా తామే అధికారంలో ఉన్నట్లు బరితెగిస్తున్నారు. సీజ్ చేసిన క్వారీ నుంచి యథేచ్ఛగా కంకర, యాష్ తరలిస్తున్నారు. అలాగని, అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా చేస్తున్నారనుకుంటే.. పొరపాటే.. పట్టపగలు పెద్ద పెద్ద టిప్పర్లతో మండల కేంద్రం మీదుగా వెళుతున్నా.. కనీసం ప్రశ్నించే అధికారే లేకపోవడం గమనార్హం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా.. కొందరు అధికారులు ఇంకా 'మేం మారం.. వైకాపాకే కొమ్ముకాస్తాం' అన్నట్లు వ్యవహరిస్తుండటం.. ఇంకొందరు తెలిసినా.. మామూళ్ల మత్తులో కళ్లు మూసుకున్నారనే విమర్శలు నెలకొన్నాయి.

ఈనాడు, నెల్లూరు

రాపూరు మండలం పులిగిలపాడు పరిధిలోని సర్వే నంబరు 6/పీలో.. నెల్లూరుకు చెందిన వైకాపా నాయకుడు వై.వి.రామిరెడ్డి క్వారీకి అనుమతి తీసుకున్నారు. గడిచిన అయిదేళ్లలో వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉండటం.. పార్టీ పెద్దలు సహకరించడంతో.. ఇష్టానుసారం వ్యవహరించారు. అనుమతి తీసుకున్న ప్రాంతం పరిధి దాటి మరీ తవ్వకాలు చేశారు. దానిపై స్థానికుల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో.. గత్యంతరం లేని పరిస్థితుల్లో భూగర్భ గనులశాఖ అధికారులు రూ. 39 కోట్ల జరిమానా విధించారు. ఆ మొత్తం చెల్లించకుండానే.. నాటి వైకాపా ప్రజాప్రతినిధుల అండతో తిరిగి దోపిడీకి తెగబడ్డారు. దానిపై ముందుగానే అధికారులను హెచ్చరించడంతో అటువైపు కన్నెత్తి చూడలేదు. ఈ ఏడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అధికారులు తనిఖీలు నిర్వహించారు. భారీగా ప్రకృతి సంపదను దోచుకున్నట్లు తేల్చారు.

### అయినా.. ఆగని దోపిడీ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని రోజులకే ఎస్ఎల్‌వీ స్టోన్‌క్రషర్‌లో తనిఖీలు నిర్వహించారు. దాదాపు 34,936 క్యూబిక్ మీటర్ల ఖనిజాన్ని అక్రమంగా తరలించినట్లు గుర్తించారు. అందుకు రూ. 75కోట్ల జరిమానా విధించారు. అలాగే క్వారీలోని 42,634 క్యూబిక్ మీటర్ల(12ఎంఎం రాయి 20,544, 20ఎంఎం రాయి 1,456, డస్ట్ 20,634 క్యూబిక్ మీటర్లు)ను సీజ్ చేశారు. దీన్ని విలువ రూ. 1.32 కోట్లుగా గుర్తించారు. పాత జరిమానాతో కలిపి ప్రభుత్వానికి రూ. 111 కోట్లు చెల్లించాలని సదరు క్వారీ యజమానికి నోటీసులు జారీ చేశారు. ఇంత జరిగినా.. సదరు వైకాపా నాయకుడు దోపిడీని ఆపలేదు. సీజ్ చేసిన కొన్ని రోజులకే మళ్లీ తవ్వకాలు ప్రారంభించారు. పెద్దఎత్తున విమర్శలు, వార్తల్లో పత్రికల్లో వార్తలు రావడంతో కొన్ని రోజులు కార్యకలాపాలు ఆపేసినా.. తిరిగి మూడు రోజులుగా సీజ్ చేసిన ఖనిజాన్ని తరలిస్తుండటం తీవ్ర చర్చనీయాంశమైంది.

### తవ్వకాలు.. తరలింపు నేరం

– ఓ. ఆనంద్, కలెక్టర్

ప్రభుత్వ అధికారులు సీజ్ చేసిన క్వారీలో మళ్లీ అనుమతి లేకుండా తవ్వకాలు చేయడం చట్టరీత్యా నేరం. రాపూరులో సీజ్ చేసిన స్టోన్ క్రషర్‌లో తవ్వకాలు చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. వెంటనే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి.. పరిశీలనకు పంపుతాం. అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తిస్తే తగు చర్యలు తీసుకుంటాం.

## పోలీసుల పోరాటం నిరుపమానం


అమరవీరుల స్తూపం వద్ద మంత్రి ఆనం, కలెక్టర్, ఎస్పీ, జడ్పీ ఛైర్‌పర్సన్, జేసీ, కమిషనర్, మేయర్ తదితరులు

**నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే:** పాఠశాల, కళాశాల స్థాయిలోనే విద్యార్థులు ఎన్‌సీసీలో చేరేలా కలెక్టర్, ఎస్పీ కృషి చేయాలని, దానివల్ల చిన్న వయసులోనే వారిలో క్రమశిక్షణ, దేశభక్తి పెరిగి.. రక్షణ దళాల్లో చేరి దేశసేవ చేయాలనే స్ఫూర్తి కలుగుతుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా సోమవారం పోలీసు కవాతు మైదానంలో జరిగి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంతర్గత భద్రత విషయంలో పోలీసులు నిత్యపోరాటం చేస్తున్నారని కొనియాడారు. పోలీసు ఎంపికల్లో శిక్షణ వరకు వెళ్లి.. చివరి నిమిషంలో ఎంపిక కానివారిని దేవాదాయశాఖలో సెక్యూరిటీ గార్డులుగా తీసుకుంటామని తెలిపారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ.. సమాజ రక్షణలో పోలీసుల కృషి స్ఫూర్తిదాయకమన్నారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రాణాలు వదిలిన పోలీసు కుటుంబాలకు అవసరమైన సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ.. జిల్లాలోని పోలీసుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టి.. ప్రతి శుక్రవారం.. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తొలుత సిబ్బంది చేసిన కవాతు ఆకట్టుకుంది. అనంతరం పోలీసు కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి, మేయరు స్రవంతి, జేసీ కార్తీక్, నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ, అదనపు ఎస్పీలు సౌజన్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


కన్నీటిపర్యంతమవుతున్న అమరవీరుల కుటుంబ సభ్యులు


# సింహపురికి మహర్దశ!

- అభివృద్ధి పనులకు రూ. 165 కోట్ల హడ్కో రుణం
- బృహత్ పథకాలకు వీడనున్న గ్రహణం

ఈనాడు, నెల్లూరు: కార్పొరేషన్, న్యూస్‌టుడే

సింహపురికి మహర్దశ పట్టనుంది. నగరంలో అభివృద్ధి పనులకు మార్గం సుగమమైంది. ఏళ్లుగా అసంపూర్తిగా వెక్కిరిస్తున్న భూగర్భ, తాగునీటి పథకాలకు పట్టిన గ్రహణం వీడనుంది. గత తెదేపా హయాంలోనే సుమారు 90 శాతానికిపైగా పూర్తయిన ఈ పనులను.. గడిచిన అయిదేళ్లలో వైకాపా ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. ప్రజలు ఆశించిన విధంగానే పనులు పునః ప్రారంభం కావడం.. తాజాగా నిధుల సమస్యకు పరిష్కారం లభించడంపై హర్షం వ్యక్తమవుతోంది.

### అప్పుడే.. 85 శాతం పూర్తి



నెల్లూరు నగరం 44.52 చదరపు కి.మీ. విస్తరించి ఉండగా- 2011 జనాభా లెక్కల ప్రకారం 5,07,751 మంది జనాభా ఉన్నారు. 2047 నాటికి 9,17,290 మంది పెరిగినా.. ఇబ్బంది లేకుండా ఉండాలనే ఉద్దేశంతో భూగర్భ మురుగునీటి వ్యవస్థ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నగరంలో మొత్తం 54 డివిజన్లు ఉండగా- 420 కి.మీ. పైప్‌లైన్ వేయాలని నిర్ణయించారు. ఇందులో 390 కి.మీ. పూర్తి చేశారు. దీంతో పాటు 14,926 మ్యాన్‌హోళ్లు, 37,200 పర్యవేక్షణ ఛాంబర్లు నిర్మించారు. వీటి ద్వారా వచ్చే మురుగునీటిని శుద్ధి చేసేందుకు అయిదు ఎస్‌టీపీ ప్లాంట్లు మంజూరు కాగా.. మూడింటిని పూర్తి చేశారు. పొట్టేపాళెం సమీపంలో నిర్మిస్తున్నది అప్పుడే 85 శాతం పూర్తికాగా.. నేటికీ అసంపూర్తిగా దర్శనమిస్తోంది. కొండాయపాళెంలో నిర్మించాల్సిన 14 ఎంఎల్‌డీ సామర్థ్యం ఉన్న ఎస్టీపీ స్థలం లేక మొదలే పెట్టలేదు. వైకాపా ప్రభుత్వం రాగానే పనులు నిలిపివేసింది. గుత్తేదారులకు బిల్లులు చెల్లించలేదు. అసంపూర్తి పనులతో ప్రజలు అయిదేళ్లుగా అవస్థలు పడుతున్నా.. పట్టించుకునే నాథుడే కరవయ్యారు. చివరకు ప్రాజెక్టు అంచనాలు పెరిగాయి. రూ. 115.52 కోట్లు రివైజ్డ్ ఎస్టిమేషన్‌ను పంపడంతో.. ప్రాజెక్టు విలువ 645.05 కోట్లకు పెరిగింది.


పూర్తయితే.. స్వచ్ఛమైన తాగునీరు

రూ. 512.76 కోట్లతో చేపట్టిన తాగునీటి పథకం దాదాపు 95 శాతం పూర్తయింది. 724కి.మీ పైపులైన్ నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండగా.. 710 కి.మీ. పూర్తి చేశారు. 32 తాగునీటి ట్యాంకులకు.. 31 పూర్తయ్యాయి. నగరంలో అన్ని రకాల తాగునీటి కనెక్షన్లు కలిపి.. మొత్తం 70వేలు ఉంది. పదేళ్ల కిందట నగరంలో 5 లక్షల జనాభా ఉండగా- ప్రస్తుతం 9 లక్షలకు చేరింది. ఇంటి నిర్మాణాలు విపరీతంగా పెరిగాయి. దాంతో తాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు ఈ పథకాన్ని ప్రారంభించారు. సంగం ఆనకట్ట నుంచి తాగునీటిని పైపుల ద్వారా నగరానికి తీసుకొచ్చారు. ఇది పూర్తయితే.. రోజూ 122 ఎంఎల్‌డీ నీటిని రెండు పూటలా అందించవచ్చని భావించారు. ప్రతి ఇంటికి పాత కుళాయి స్థానంలో కొత్తగా కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించారు. వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో పరిస్థితి మారిపోయింది.

### నిధులొస్తే.. ఆకర్షణీయ నగరమే..

– సూర్యతేజ, కమిషనర్, ఎన్ఎంసీ

నెల్లూరు నగరంలో అభివృద్ధి పనులకు రుణం ఇచ్చేందుకు హడ్కో సుముఖత వ్యక్తం చేయడం శుభపరిణామం. ఆ నిధులొస్తే.. అసంపూర్తి పనులు పూర్తి చేయడంతో పాటు నగరాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు వీలవుతుంది. యూజీడీ, తాగునీటి పథకాలు పూర్తవుతాయి. ప్రజల ఇబ్బందులకు పరిష్కారం లభిస్తుంది.

## అలాగైతే.. భూములు ఇవ్వలేం!

**కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే:** జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న వారికి నష్టపరిహారం పెంచాలని ఓగూరు రైతులు డిమాండ్ చేశారు. ఓగూరులో సచివాలయం వద్ద భూమి కోల్పోతున్న రైతులతో రెవెన్యూ అధికారులు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరాయకొండ దగ్గర నుంచి మాల్యాద్రి కాలనీ వరకు సేకరిస్తున్న భూమికి ఎకరాకు రూ. 24 లక్షలు నుంచి రూ. 28 లక్షల వరకే పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇదే రహదారిలోని అలావారిపాలెం సమీపంలో చిల్లచెట్లు, కుంటలు ఉన్న భూమికి రూ. 76 లక్షలు పరిహారం ఇచ్చారని అభ్యంతరం తెలిపారు. కనీసం భూమిలో కొలతలు వేయకుండా, బోర్లు, చెట్లు ఎన్నిపోతున్నాయో చెప్పకుండా బ్యాంకు ఖాతాలు ఇస్తే నగదు జమ చేస్తామనడం సరికాదన్నారు. దానికి తహసీల్దారు ఇక్బాల్ మాట్లాడుతూ.. గతంలో జేసీ, రెవెన్యూ అధికారులు పరిశీలించి ధర నిర్ణయించారన్నారు. దానికి రైతులు.. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి భూమి ఇచ్చేందుకు సిద్ధంగా లేమని స్పష్టం చేశారు.





## రైతుల ప్రయోజనాలకే
# మొదటి ప్రాధాన్యం




బి.వెంకటరమణారెడ్డి, సోమశిల ప్రాజెక్టు ఎస్ఈ

న్యూస్‌టుడే, ఆత్మకూరు

సోమశిల జలాశయం పరిధిలోని సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి నిలిపినట్లు ఎస్ఈ బి.వెంకటరమణారెడ్డి తెలిపారు. జలాశయంలో నీటి నిల్వ 60 టీఎంసీలకు చేరింది.. మరోవైపు వరద ప్రవాహం కొనసాగుతోంది.. ఈ పరిస్థితుల్లో ప్రాజెక్టు పరిధిలోని సమస్యలు, వరద ప్రవాహం నిర్వహణలో ముందస్తు వ్యూహాలను 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో ఆయన వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

### డిసెంబరు మొదటి వారం వరకు...

జలాశయానికి డిసెంబరు మొదటి వారం వరకు వరద కొనసాగుతుంది. ప్రస్తుతం అది 15వేల క్యూసెక్కులుగా ఉంది. పైతట్టు ప్రాంతాల్లో వర్షాలకు అనుగుణంగా ప్రవాహంలో హెచ్చుతగ్గులు ఉంటాయి. జలాశయానికి వచ్చే నీటిని రైతులకు ఉపయోగపడేలా పంపిణీ విధానంలో మార్పులు చేస్తున్నాం.

### ఆప్రాన్ పూర్తయిన తర్వాతే...

రక్షణ కట్టడాల్లో కీలకమైన ఆప్రాన్ పనులు చేస్తున్నాం. అనంతరం స్టెప్డ్ ఆప్రాన్, కుడి, ఎడమ ప్రొటెక్షన్ వాల్ నిర్మాణంపై దృష్టిపెడతాం. రూ. 2.4 కోట్ల విలువైన క్రస్ట్ గేట్ల రోప్ పనులు టెండర్ల దశలో ఉన్నాయి. కండలేరు వరద కాలువ రెగ్యులర్ స్టాప్‌లాక్ గేట్లు, ఇతర సాంకేతిక సమస్యలు డ్రాయింగ్ దశలో ఉన్నాయి. అవి సిద్ధమైన తర్వాత.. టెండర్లు పిలవనున్నాం.

### ఎప్పుడైనా.. నీటి విడుదల

జలాశయంలో ఇప్పటికే 60 టీఎంసీల నిల్వ ఉంది. వచ్చినవాటిలో పది వేల క్యూసెక్కులను కండలేరుకు తరలిస్తున్నాం. రికార్డు స్థాయిలో వరద వస్తే ఎప్పుడైనా విడుదల చేసే అవకాశం ఉంది. సాధ్యమైనంత ఎక్కువ నీటిని వినియోగించుకునేలా.. సాగునీటి యాజమాన్యంపై ప్రత్యేక దృష్టి నిలిపాం.

### అప్పుడే సంపూర్ణ సోమశిల సాకారం

సంపూర్ణ సోమశిల(ఉత్తర, దక్షిణ, కావలి, కనుపూరు కాలువలు)కు అడ్డుగా ఉన్న భూసేకరణ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. అటవీశాఖ అనుమతులు రావాల్సి ఉంది. అందుకు సంబంధించిన పనులు ముందుకు సాగుతున్నాయి. భూసేకరణ పూర్తయితే సంపూర్ణ సోమశిలకు అడ్డంకులు తొలగుతాయి. ఇక ఆయకట్టుకు నీటి విడుదల నిర్ణయం ఐఏబీపై ఆధారపడి ఉంది. నిర్దేశించిన మేరకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం.



## తాటిమాను బోటు

అరే ఇదేమిటి? తాటిమానుతో బోటులా చేశారే అనుకుంటున్నారా! అవును ఇది తాటిమాను బోటే.. కృష్ణా, గోదావరి జిల్లాలో రైతుల వద్ద ఎక్కువగా కనిపించే ఈ తరహా పడవను.. అక్కడ చూసొచ్చి.. ఇక్కడ స్వయంగా తయారు చేసుకుని చేపల వేటకు వినియోగిస్తున్నట్లు ఈ వృద్ధుడు తెలిపారు. – ఈనాడు, నెల్లూరు

# గుత్తేదారు చల్లగుండ!

ఏసీ బిల్లుల్లో మతలబు
విచారణకు ఆదేశం

ఎద్దు ఈనింది అంటే.. దూడను కట్టేయమన్న సామెతగా తయారైంది నగరపాలక సంస్థలో కొందరు అధికారుల తీరు.. అంతేనా, అవినీతి అక్రమాలకూ అంతే లేకుండా పోతోంది. అందుకు నిదర్శనం.. తక్కువ సామర్థ్యం కలిగిన ఏసీలను బిగించి.. ఎక్కువ సామర్థ్యం ఏసీలకు బిల్లులు పెట్టడమే.. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు రావడంతో కమిషనర్ సూర్యతేజ విచారణకు ఆదేశించారు. సోమవారం అకౌంట్స్ విభాగం నుంచి సదరు బిల్లులను తెప్పించుకుని.. స్వయంగా విచారణ చేపట్టారు.

— న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ) —

ఎండ వేడిమికి కంప్యూటర్లు పనిచేయడం లేదని, ఉక్కపోత భరించలేకపోతున్నామని.. నెల్లూరు నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగంలోని ఉద్యోగులు డిప్యూటీ కమిషనర్ వద్ద మొరపెట్టుకోగా- మూడు ఏసీలను మంజూరు చేశారు. వాటిని బిగించే బాధ్యతను ఆఘమేఘాలపై శ్రీసాయి హనుమాన్ ఎంటర్‌ప్రైజన్ గుత్తేదారుడికి అప్పగించారు. సాధారణంగా గుత్తేదారులు తొలుత పనిచేసి.. తర్వాత బిల్లులు పెడతారు. అధికారుల అండదండలు పుష్కలంగా ఉండటంతో.. ఇక్కడ గత ఏడాది జులైలో ఏసీ బిల్లులకు ఆమోదం తెలపగా.. నవంబరులో బిగించడం గమనార్హం.

### సామర్థ్యం తక్కువ..

2.0 టన్ సామర్థ్యం కలిగిన హిటాచి సంస్థ ఏసీలు బిగించాలని అధికారులు ఉత్తర్వులు ఇవ్వగా- గుత్తేదారుడు 1.5 టన్‌వి బిగించారు. వాటిలోనూ రెండు కొత్త హిటాచీ, ఒకటి పాత ఓల్టాస్ ఏసీని తీసుకొచ్చి బిగించారు. అయినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. పైగా హిటాచీ ఏసీ 1.5 టన్ విలువ రూ. 45వేలు ఉండగా.. 2.0 టన్ ఏసీ బిగించినట్లు ఒక్కోదానికి రూ. 88,216 చొప్పున మూడింటికి రూ. రూ.2,64,648కు బిల్లులు పెట్టారు. అధికారులు కళ్లు మూసుకుని బిల్లులపై సంతకాలు పెట్టేశారు. వీటితో పాటు హౌసింగ్ విభాగంలో బిగించిన ఏసీలపైనా విమర్శలు నెలకొన్నాయి. గుత్తేదారుడు గతంలో నగరపాలక సంస్థ కార్యాలయంలోనే అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తూ జనన, మరణ ధ్రువీకరణ పత్రాల మంజూరులో ట్యాంపరింగ్‌లో పాల్పడగా- అప్పటి కమిషనర్ అలీంబాషా సస్పెండ్ చేశారు. అదే వ్యక్తి కార్యాలయంలో గుత్తేదారుడిగా అవతారం ఎత్తడం గమనార్హం. దీనిపై కమిషనర్ వివరణ కోరగా.. ఫైల్ తెప్పించుకుని, విచారిస్తున్నామని తెలిపారు.


రెవెన్యూ విభాగంలో బిగించిన ఏసీలు

# మమతలు మాయం.. మనసుకు గాయం



గ్రీవెన్స్‌లో పాల్గొన్న బాధితులు

- ఈ నెల 15న వెంకటేశ్వరపురం రైల్వే బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వృద్ధురాలు (60) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. ఆమె వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. రైల్వే పోలీసులు ఆరా తీయగా కుటుంబ సభ్యులు పట్టించుకోక ఆత్మహత్య చేసుకున్నట్లు దర్యాప్తులో తేలింది.
- ఆస్తి రాసివ్వడం లేదని ఓ కుమారుడు కన్న తల్లినే హత్య చేశాడు. ఈ ఘటన కొన్ని నెలల క్రితం జిల్లాలో చోటు చేసుకుంది.
- ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీల్లో పది శాతం వృద్ధుల సమస్యలే కావడం గమనార్హం. కుమారులు చూడటం లేదని, ఆస్తి కోసం వేధిస్తున్నారంటూ ఫిర్యాదు చేస్తున్నారు.

న్యూస్‌టుడే, నెల్లూరు (నేర విభాగం)

### ఆత్మహత్య చేసుకుంటున్న వృద్ధులు

### ప్రజా సమస్యల పరిష్కార వేదికలోనూ ఫిర్యాదులే

తల్లిదండ్రులు తమ పిల్లలను కంటికి రెప్పలా కాపాడి పెద్ద చేస్తున్నారు. ప్రయోజకులుగా మారి.. స్థిరపడ్డాక.. కన్నవారిని కాదంటున్నారు. భారమవుతున్నారని కొందరు.. ఏం పనిచేయలేకపోతున్నారని మరికొందరు.. ఆస్తులు ఇవ్వడం లేదని ఇంకొందరు.. తల్లిదండ్రులను మరిచిపోతున్నారు. ఆశ్రమాలలో చేర్పిస్తున్నారు. వృద్ధాప్యంలో అండగా ఉంటారనుకున్న కుమారులు, కుమార్తెలు చూడటం లేదనే మనస్తాపంతో కొందరు బలవన్మరణాలకు పాల్పడుతుండగా, మరికొందరు పోలీసు కార్యాలయాలకు వస్తున్నారు. ఇటీవల కాలంలో వృద్ధులు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటనలు పెరిగాయి. ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

**పోలీసు కార్యాలయానికి వచ్చినవి..**

| నెల | ఫిర్యాదులు | పిల్లలు చూడటం లేదని |
|---|---|---|
| జులై | 387 | 38 |
| ఆగస్టు | 423 | 35 |
| సెప్టెంబరు | 398 | 23 |
| అక్టోబరు (14వరకు) | 98 | 11 |

#### పది శాతం వారే..

ఇటీవల కాలంలో కుమారులు చూడటం లేదని, ఆస్తి పంచడం లేదని వేధిస్తున్నారని, దాడులకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు ఎక్కువయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఏదో ఒక ప్రాంతం నుంచి ఇలాంటి సమస్యలు వస్తూనే ఉన్నాయి. ప్రతి సోమవారం వచ్చే ఫిర్యాదుల్లో పది శాతం ఇలాంటివే ఉండటం గమనార్హం. వచ్చిన ఫిర్యాదులను పోలీసు ఉన్నతాధికారులు ఆయా పోలీసు స్టేషన్లకు పంపించి కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. కొందరు మారుతున్నారు.. మరికొందరిలో మార్పు లేదు. ఇక రైలు కింద పడి మృతిచెందే వారిలో ఎక్కువగా వృద్ధులు ఉండటం గమనార్హం. కావలి నుంచి తడ వరకు ఉన్న నెల్లూరు డివిజన్ పరిధిలో తరచూ ఆత్మహత్యలు జరుగుతున్నాయి. వీటిలో కూడా వృద్ధులు ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

#### కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం

డి.శ్రీనివాసరెడ్డి, నగర డీఎస్పీ

ఆస్తి పంచడం లేదని చూడకుండా వదిలేస్తున్నారంటూ వృద్ధులు ఫిర్యాదు చేస్తున్నారు. వాటిని పరిశీలించిన అనంతరం కుటుంబసభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. వారిలో మార్పు తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నాం.

# బంజరు నేల.. సిరుల హేల

న్యూస్‌టుడే, అల్లూరు



సాగుకు అనువుగా లేని భూములు. ఏ పంటలు పండవని వదిలేయడంతో బీళ్లుగా మారాయి. వీటిలో జామాయిల్ సాగు చేసి మంచి ఫలితాలు సాధించారు నార్తుఆములూరు గ్రామానికి చెందిన రామయ్య. సాగునీటి సదుపాయం లేకపోవడంతో తనకున్న రెండెకరాల్లో జామాయిల్ సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. భూమిని సాగు యోగ్యంగా మార్చారు. సేంద్రియ ఎరువులు వేసి సారవంతం చేశారు. రూ.50 వేలు ఖర్చు చేయగా రూ.5.50 లక్షల ఆదాయం వచ్చింది. టిష్యూకల్చర్ మొక్కలు నాటారు. వీటిని నిత్యం పర్యవేక్షించారు. పెరుగుదల లోపించిన వాటికి పోషకాలు అందించారు. మూడున్నర సంవత్సరాల తరువాత కోతకు రావడంతో విక్రయించారు. ఎకరాకు దాదాపు 40 టన్నుల వరకు వచ్చింది. రెండెకరాలకు 80 టన్నులు రాగా టన్ను రూ.7500 చొప్పున విక్రయించారు. రూ. ఆరు లక్షల రాబడి వచ్చింది. ఇందులో పెట్టుబడి రూ. 50 వేలు పోగా, రూ. 5.5 లక్షల ఆదాయం వచ్చింది. పక్కా ప్రణాళికతో సాగు చేస్తే లాభాలు వస్తాయని రామయ్య తెలిపారు.

రైతేరాజు

## సమస్య- సమాధానం

**సమస్య :** నాణ్యమైన దిగుబడుల కోసం ఏ సమయంలో జిలకర మసూర విత్తనాలు నారు పోసుకోవాలి?
**-రమేష్, అల్లూరు**

**సమాధానం :** ఈనెల ఆఖరు వారంలో లేదా నవంబరు మొదటి వారంలో పోసుకోవచ్చు.

**సమస్య :** దుక్కిలో జీలుగ దున్నే సమయంలో సూపర్‌ఫాస్ఫేటు వేసుకోవచ్చా? **-రాంబాబు, అల్లూరుపేట**

**సమాధానం :** ముందుగా మందు చల్లిన తరువాత దున్నివేయాలి.

**సమస్య :** నేరుగా వెదజల్లే విధానం ద్వారా ఉపయోగాలు తెలుపగలరు? **-అనిల్, పురిణి**

**సమాధానం :** వారం రోజుల ముందుగా కోతకు వస్తోంది. దిగుబడిలో మార్పులు ఏమీ ఉండవు.

**సమస్య :** ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. తెలంగాణ రకాలు వేసుకోవచ్చా ? **-గోపాల్, బీరంగుంట**

**సమాధానం :** వ్యవసాయ శాఖ అధికారులు సలహాలు తీసుకొని సాగు చేసుకోవాలి.

( రైతుల సందేహాలకు వ్యవసాయాధికారిణి లలిత సమాధానాలు ఇచ్చారు.) **-న్యూస్‌టుడే, అల్లూరు**

## సెనగ.. కాసుల పండగ



న్యూస్‌టుడే, చేజర్ల

నల్ల రేగడి నేలల్లో ఆఖరి వర్షానికి సాగు చేస్తే నేలలోని తేమ, గాలిలోని మంచుతో మంచి దిగుబడి ఇస్తూ మెట్ట ప్రాంత రైతులకు సెనగ లాభదాయకంగా మారింది. విపణిలో మంచి ధరలు ఉండడంతో గత సీజనులో ఆత్మకూరు. ఉదయగిరి నియోజకవర్గాల రైతులు ఎర్ర, తెల్ల రకాల సాగుపై ఆసక్తి చూపారు. ఎకరానికి అయిదు నుంచి తొమ్మిది క్వింటాళ్ల దిగుబడితో రూ. 35 వేల ఆదాయం పొందారు. చేజర్ల మండలం చిత్తలూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఎకరానికి ఎనిమిది క్వింటాళ్ల దిగుబడి సాధించి లాభాల పంట పండించారు.

**సాగు చేశారిలా:** వేసవిలో దుక్కి చేసి వర్షాలకు ఎక్కువ నీరు పీల్చుకోనేలా చేశారు. ఎకరానికి 75 కిలోల విత్తనాన్ని విత్తారు. 90 రోజుల అనంతరం పంట కోసి యంత్రాలతో నూర్పిడి చేశారు. దుక్కి, విత్తనాలు, ఎరువులు, మందులు, కూలీలు తదితర ఖర్చులకు రూ.27 వేలు అయ్యాయి. ఎకరాకు ఏడు పంట దిగుబడి ఎకరానికి ఏడు క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చింది. క్వింటాల్ రూ.8 వేల వంతున విక్రయించారు. రాబడిగా రూ 56 వేలు రాగా సాగు ఖర్చులు రూ.27 వేలు పోను ఎకరానికి ఆదాయంగా రూ. 29 వేలు మిగిలాయి.

## వర్షాకాలం.. జాగ్రత్తలతో వ్యాధులు దూరం

**వరికుంటపాడు, వింజమూరు, న్యూస్‌టుడే:** వర్షాలసయంలో పశువులు పలు వ్యాధులకు గురవుతాయని పెద్దిరెడ్డిపల్లె పశువైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్రశర్మ సూచించారు. వీటిని నివారించాలంటే అప్రమత్తంగా ఉండాలని వివరించారు.



ఎస్వీ రాఘవేంద్రశర్మ

**వీటిని పాటించాలి:** ● పాకల్లో చిత్తడి లేకుండా చూసుకోవాలి. ● మంచినీరు అందుబాటులో ఉంచాలి. ● బ్లీచింగు పొడి లేదా సున్నం చల్లాలి. వేపాకు పొగ వేస్తే దోమలు, ఈగల బెడద నుంచి రక్షణ పొందవచ్చు. ● గిట్టలు పాచిపడితే అయిదు శాతం ఫార్మలిన్ లేదా మైలతుత్తం ద్రావణంలో ముంచితే కొంతమేరకు నొప్పుల నుంచి ఉపశమనం కలుగుతోంది. ● గురక వ్యాధి రాకుండా టీకాలు వేయించాలి. ● మేతకు నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాలకు తీసుకెళ్లకూడదు. కూలిపోయే స్థితిలో ఉన్న పాకలు, లేదా గోడల పక్కన కట్టేయరాదు.

**గొర్రెలు, మేకల పెంపకందారులు..**

- మేత కోసం కొండలు, వాగుల వద్దకు తోలుకెళ్లరాదు.
- విపరీతమైన చలిగాలుల నుంచి రక్షణ ఇవ్వాలి.
- శరీర ఉష్ణోగ్రత తగ్గకుండా ఎప్పటికప్పుడు చూసుకోవాలి.
- నెలలోపు పిల్లలకు చలిగాలి రక్షణ కల్పిస్తే మృత్యువాత పడవు.
- ముందుజాగ్రత్తగా హెచ్ఎస్, ఈటీ, నేలమురక, పిల్లి ముసర, బ్లూటంగ్ వ్యాధుల నివారణకు టీకాలు వేయించాలి.

## చామ సాగు.. లాభాలు బాగు

న్యూస్‌టుడే, కావలి



చామ సాగుతో రెట్టింపు ఆదాయం గడిస్తున్నారు ఆ రైతు. సముద్ర తీర ప్రాంతమైన కావలి మండలంలోని పూలదొరువు గ్రామానికి చెందిన అళహరి నరసయ్య. అనాదిగా సంప్రదాయ పంటలు వేస్తూ నష్టపోతున్నారు. ఎంత కష్టపడినా లాభాలు రావడం లేదు. దీంతో కూరగాయల సాగుపై దృష్టి పెట్టారు. చామ వేసి లాభాలు పండిస్తున్నారు. తనకున్న ఇసుక నేలలోనే దీన్ని వేశారు. మట్టి నేల కంటె ఎక్కువగా దిగుబడి సాధించారు. చీడపీడల బెడద చాలా తక్కువగా ఉందంటున్నారు. మంచు, వర్షాల సీజన్‌లో మాత్రమే రూపాయి మచ్చ తెగులు సోకే అవకాశాలుంటాయని, దీన్ని సస్యరక్షణ చర్యలతో అధిగమించవచ్చని వివరిస్తున్నారు. దుక్కికి రూ.20 వేలు, విత్తనాల కొనుగోలుకు రూ.30 వేలు, ఎరువులకు మరో రూ.30 వేలు, కూలీలకు రూ.20 వేల చొప్పున ఖర్చు చేశారు. దిగుబడిగా ఎకరాకు 100 బస్తాల వరకు వచ్చాయి. ఒక్కో బస్తాకు 73 కిలోల వంతున నింపుతున్నట్లు చెప్పారు. బస్తా రూ.2 వేలకు విక్రయించడంతో రూ.రెండు లక్షల వరకు రాబడి వచ్చింది. పెట్టుబడి రూ.లక్ష పోగా రూ.లక్ష మిగిలింది.

## దరఖాస్తుకు గడువు పెంపు

**నెల్లూరు(విద్య) :** సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్సియల్ విధానంలో డీఎస్సీకి ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు సోషల్ వెల్ఫేర్ డీడీ బి.శ్రీనివాసులు ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుకు ఈ నెల 21వరకు ఉన్న గడువు 25కి పెంచామని.. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## ప్రతి అర్జీ పరిష్కారానికి చర్యలు తీసుకోండి

**నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే:** జిల్లాలో ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని క్షుణ్నంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఒ.ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కువ శాతం రెవెన్యూ, సర్వే, పంచాయతీరాజ్‌శాఖలకు సంబంధించి అర్జీలు వస్తున్నాయన్నారు. వివిధ సమస్యలపై మొత్తం 375 అర్జీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో జేసీ కె.కార్తీక్, డీఆర్వో లవన్న, జడ్పీ సీఈవో మోహన్‌రావు, డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, డీపీవో శ్రీధర్ రెడ్డి, డీఈవో రామారావు, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు, వ్యవసాయ శాఖ, పశుసంవర్ధకశాఖ జేడీలు తదితరులు పాల్గొన్నారు.

## మోసాలపైనే అధిక ఫిర్యాదులు

**న్యూస్‌టుడే, నెల్లూరు(నేర విభాగం):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి సోమవారం జిల్లా వ్యాప్తంగా వచ్చిన బాధితులు తమ సమస్యలను అర్జీల రూపంలో ఇచ్చారు. ఈ సారి మోసాలపై ఎక్కువ వినతులు రావడం విశేషం. వచ్చిన అర్జీలను జిల్లా అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య ఆయా స్టేషన్లకు అందజేశారు. వీలైనంత వరకు సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ గిరిధర్ రావు, న్యాయ సలహాదారు శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● తనకు, భర్తకు విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ఓ మహిళ రూ.5.30 లక్షలు తీసుకుంది. ఉద్యోగాలు రాలేదు. నగదు తిరిగి ఇవ్వకుండా బెదిరిస్తున్నారని, విచారించి న్యాయం చేయాలని కోరారు. ● ఇంటర్మీడియట్‌లో తనతో సన్నిహితంగా ఉండే స్నేహితుడు తన వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పెట్టి, కుటుంబ సభ్యులకు పంపి బెదిరిస్తున్నాడని వరికుంటపాడుకు చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు. ● ఆర్టీసీ సెక్యూరిటీ వరప్రసాద్ పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని చేశాడని బిట్రగుంటకు చెందిన ఓ మహిళ అధికారులకు చెప్పి వాపోయింది. ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి కుల వివక్ష చూపుతున్నాడని వేదాయపాలేనికి చెందిన వంశీకృష్ణపై అదే ప్రాంతానికి చెందిన మహిళ ఫిర్యాదు చేశారు. ● మధు అనే వ్యక్తి తక్కువ ధరలకే ఇంటి స్థలాలు ఇప్పిస్తానని చెప్పి తనతో పాటు షాపింగ్‌మాల్‌లో పనిచేసే వారి దగ్గర రూ. 8లక్షలు తీసుకుని మోసం చేశాడని వేదాయపాలెంకు చెందిన ఓ అర్జీ ఇచ్చారు. ● తన భర్త చెడు వ్యసనాలకు బానిసయ్యాడని, అత్తమామలు వేధిస్తున్నారని గుడ్లూరు, వేదాయపాలెంకు చెందిన మహిళలు ఫిర్యాదు చేశారు. ● తన కుమారుడిని హత్య చేసి రోడ్డు ప్రమాదంలా చిత్రీకరించారని, పోస్టుమార్టం కూడా చేయలేదని దగదర్తికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు.



సమస్యలు వింటున్న అదనపు ఎస్పీ



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై వివాదం

### హాల్‌టిక్కెట్ల జారీకి యాజమాన్యం నిరాకరణ

**అల్లూరు, న్యూస్‌టుడే :** ఫీజు రీయింబర్స్‌మెంట్ చిచ్చు మరో కళాశాలలో రేగింది. ఈనగదు కళాశాలకు రాకపోవడంతో విద్యార్థులకు పరీక్షలకు హాల్ టిక్కెట్లు ఇవ్వడానికి యాజమాన్యం నిరాకరించింది. బకాయి చెల్లించాలని స్పష్టంచేసింది. దీంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈఘటన గ్రామంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగింది. ఈ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో పేదలకు ప్రభుత్వం ఫీజు చెల్లిస్తోంది. ఇది పూర్తిగా రాలేదు. మరోవైపు త్వరలో సెమిస్టర్ పరీక్షలు జరగనున్నాయి. ఈనేపథ్యంలో ప్రభుత్వం నుంచి నగదు రాకపోవడంతో హాల్‌టిక్కెట్లు ఇవ్వలేదు. బకాయి మొత్తం చెల్లించాలని సూచించడంతో వివాదం రేగింది. ఈ విషయమై వైస్ ప్రిన్సిపల్ శిరీషను వివరణ కోరగా కళాశాలకు సంబంధించిన ఫీజు చెల్లించాలని కోరామని తెలిపారు. నిర్వహణకు మాత్రమే అడిగామని వివరించారు.

# యువత.. సేవా నడత



దివ్యాంగుల కాలనీలో పేదలకు దుస్తులు అందజేస్తున్న తేజస్విని

**కావలి, న్యూస్‌టుడే:** పట్టణంలోని యువతులు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందంజలో నిలుస్తున్నారు. ఆపన్నులను ఆదుకుంటున్నారు. ప్రకృతి విపత్తుల్లో బాధితులకు ఆసరాగా నిలుస్తున్నారు. వారు నడిచే బాటలో మరెందరో పయనించేలా చేస్తున్నారు. ఆదర్శప్రాయంగా వ్యవహరిస్తున్నారు.

### క్రౌడ్ ఫండింగ్ ద్వారా చేయూత



ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతూ చికిత్స పొందేందుకు ఆర్థిక స్థోమత లేని పేదల పాలిట ఆపద్బాంధవిలా నిలిచారు **పెట్లూరు సాయిస్వాతి.** ఇప్పటివరకు రూ.అయిదు లక్షల వరకు ఆన్‌లైన్‌లో క్రౌడ్ ఫండింగ్ చేసి అవసరమైన వారికి అందించారు. మరో 50 మందికి పేరొందిన ఆసుపత్రుల నుంచి వైద్య సహాయం అందేలా చూశారు. ఆన్‌లైన్‌లో తమను సంప్రదించే వారి వివరాలన్నీ సేకరించి వ్యాధి తీవ్రత, ఇతర అంశాలన్నీ పరిశీలిస్తారు. వీరికి ఏవిధంగా సాయం చేయాలనే విషయాలపై పట్టణంలోని వైద్యురాలు నళినీపద్మ వద్ద సలహాలు తీసుకుంటున్నారు. వారికి అవసరమైన మొత్తాలను టీం సేవియర్స్ సంస్థ ద్వారా అందేలా చేస్తున్నారు. పేదల చదువుకు ఇబ్బందులైనా సాయపడుతున్నారు.

### ప్రాణం పోస్తూ..

పట్టణంలోని విట్స్ కళాశాలలో బీటెక్ పూర్తి చేసిన **పోనుగుంటి తేజస్విని** ఉన్నత చదువుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు రక్తదానం చేస్తున్నారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. ఎక్కడ ఎవరికి అవసరమైనా వెళ్లి రక్తదానం చేస్తున్నారు. ఈ ఉద్యమంలో తోటి వారిని భాగసామ్యం చేస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో చలికాలంలో దివ్యాంగుల కాలనీలో పేద కుటుంబాలకు దుప్పట్లు అందజేశారు. ఎక్కడైనా మహిళలపై అఘాయిత్యాలు జరిగితే స్థానికంగా ఆందోళనలు నిర్వహించి స్వరం వినిపిస్తున్నారు.

### చైతన్య దీపిక



సమాజంలో ప్రజలకు ఎప్పటికప్పుడు సమకాలీన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు **వేముల జాహ్నవి** కృషి చేస్తున్నారు. ఇప్పటివరకు 32 సదస్సులు నిర్వహించారు. మహిళలు, బాలికలతోపాటు ప్రజలకు వివిధ అంశాల్లో సదస్సులు నిర్వహిస్తున్నారు. పేదల నివాస ప్రాంతాలు, విద్యాసంస్థల్లోనూ ఈమె సదస్సులు నిర్వహిస్తున్నారు. పేదరిక నిర్మూలనలో భాగంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వివరిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల సంక్షేమానికి అమలుచేస్తున్న పథకాలను తెలియజేస్తున్నారు. ఎలా దరఖాస్తు చేసుకుంటే, లబ్ధి పొందుతారనే విషయమై అవగాహన కల్పిస్తున్నారు. ఎంసీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఈమె తన మిత్ర బృందం కూడా సేవల్లో పాల్గొనేలా చేస్తున్నారు. రక్తదానం చేసి ప్రాణాలు నిలుపుతున్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ

## విద్యతో పాటు క్రీడలు అవసరం

**వెంకటాచలం, న్యూస్‌టుడే:** విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమని వీఎస్‌యూ ఉపకులపతి విజయ భాస్కర రావు తెలిపారు. అంతర కళాశాలల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను సోమవారం ఆయన అభినందించారు. క్రీడలు విద్యార్థుల మానసిక, శారీరక దృఢత్వానికి దోహదపడతాయన్నారు. రిజిస్ట్రార్ సునీత, క్రీడా బోర్డు కార్యదర్శి వెంకటరాయులు తదితరులు పాల్గొన్నారు.

## రైలు కింద పడి మహిళ మృతి

**కావలి:** రైలు కింద పడి గుర్తు తెలియని మహిళ మృతి చెందిన వైనమిది. సోమవారం పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద పట్టాలపై మృతదేహం పడి ఉండగా గుర్తించారు. ఆమె వయసు 40 నుంచి 45 సంవత్సరాల లోపు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కనిపించని స్వామి నగ

### వెదికితే దొరికిందట

**బిట్రగుంట, న్యూస్‌టుడే:** కొండబిట్రగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారి అలంకారానికి ఉపయోగించే ఓ నగ కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల వీటిని పరిశీలించేందుకు గుంటూరు నుంచి జేవీఓ (జ్యుయలరీ వెరిఫికేషన్ ఆఫీసర్) చంద్రమౌళి వచ్చారు. ఈ నేపథ్యంలో 55 గ్రాముల బంగారు పూల దండ కనిపించ లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈవో రాధాకృష్ణ స్వామికి అలంకారం చేసే బాధ్యుడైన అర్చకుడు లక్ష్మీనరసింహాచార్యులుకు నోటీసులు జారీచేశారు. పది రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ విషయమై పూజారి లక్ష్మీనరసింహాచార్యులును వివరణ కోరగా స్పందించారు. నగ ఉందని వెదకగా కనిపించిందని రెండు రోజుల్లో ఈవో రాధాకృష్ణకి ఇస్తామని తెలిపారు.





నిరసన చేస్తున్న మహిళలు

## మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దు

**ఇందుకూరుపేట :** ఇళ్ల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడంపై స్థానిక మహిళలు ఆందోళన చేపట్టారు. సోమవారం ఇందుకూరుపేట పోలీస్‌స్టేషన్ పక్కనే మద్యం దుకాణం ఏర్పాటు చేస్తున్నారని తెలుసుకున్న మహిళలు భారీగా చేరుకుని దుకాణం ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఎక్సైజ్, పోలీసుశాఖల అధికారులు అక్కడికి చేరుకుని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

## ద్విచక్ర వాహనం, కారు ఢీ

**కూడేరు(ఉరవకొండ) :** ద్విచక్ర వాహనం, కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన కూడేరు మండలంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. కూడేరుకు చెందిన దామోదర్, ఆత్మకూరు మండలం సింగంపల్లికి చెందిన అశోక్, నెల్లూరుకు చెందిన వినోద్ ముద్దలాపురం సమీపంలోని సుజలాన్ కంపెనీలో పని చేస్తున్నారు. సోమవారం సాయంత్రం వారు వ్యక్తిగత పనిపై ద్విచక్ర వాహనంపై ఉరవకొండకు వెళ్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని శివరాంపేట వద్ద జాతీయ రహదారిలో ద్విచక్ర వాహనం, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులను చికిత్స కోసం అనంతపురం తరలించారు. వీరిలో అశోక్ పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు.

# ఏళ్లుగా కష్టాలు.. పట్టించుకోని పాలకులు

**పాలకులు మారుతున్నా.. దశాబ్దాలుగా తమ తలరాతలు మారడం లేదని జలదంకి మండలం, గట్టుపల్లి గ్రామ పంచాయతీలోని కరుకోరిపాలెం గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేటికీ గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్నా.. పట్టించుకున్న దాఖలాలు లేవని చెబుతున్నారు.**



రాళ్లు తేలిన చప్టా



వాగు దాటి నీటిని తీసుకొస్తున్న యువకుడు

### వాగులు దాటి..

గ్రామ పరిధిలో రెండు వాగులున్నాయి. వీటిపై నిర్మించిన లోలెవల్ వంతెనలు శిథిలావస్థకు చేరాయి. ప్రస్తుతం వరద ప్రవహిస్తుండడంతో తాగు నీరందించే వాహనాన్ని గ్రామశివారులోనే ఆపుతున్నారు. చేసేది లేక గ్రామస్థులు.. కి.మీ. దూరం ఉన్న వాగులను దాటి తెచ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. రోడ్డు వసతి సక్రమంగా లేక అద్దె ఆటోలు సైతం రావడం లేదని వాపోతున్నారు.

**జలదంకి, న్యూస్‌టుడే:** కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామంలో ఉన్న లోతట్టు వంతెనలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొద్దిపాటి వర్షం కురిసినా వాగులు పొంగుతుండడంతో రాకపోకలు స్తంభిస్తున్నాయి.

### తాగు నీటికి ఇక్కట్లు

గ్రామంలో 150 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వీరందరికీ ఉప్పునీరు సరఫరా అవుతుండడంతో తాగేందుకు వీలు పడడం లేదు. దీంతో నీరు కొనుగోలు చేయాల్సి వస్తోంది. గ్రామానికి ప్రైవేటు ప్లాంట్ల నుంచి వాహనాల ద్వారా శుద్ధజలం సరఫరా అవుతుంది. ప్రస్తుతం చప్టాలు శిథిలావస్థకు చేరటం, వర్షాలు పడుతుండడంతో వాహనాలు రావటం మానేశాయి. దీంతో గత్యంతరం లేక ఉప్పునీరే కొద్ది రోజులు తాగామని స్థానికులు చెబుతున్నారు.

### అనారోగ్యం బారిన పడిన అంతే..

వేణు ప్రతాప్‌రెడ్డి, కరుకోరుపాలెం



మా గ్రామానికి రహదారి వసతి సక్రమంగా లేదు. కొద్దిపాటి వర్షం కురిసినా రెండు ప్రధాన వాగులు పొంగి ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన చప్టాలు శిథిలావస్థకు చేరాయి. తుపానుల సమయంలో ప్రమాదాలు జరిగినా..అనారోగ్యానికి గురైన వారిని కావలి పట్టణంలోని వైద్యశాలకు తీసుకుపోవాలంటే ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా పాలకులు స్పందించి వాగులపై చప్టాలు నిర్మించాలి.

### మరమ్మతులకు ప్రతిపాదనలు పంపుతాం

ఎం.బ్రహ్మయ్య, ఎంపీడీవో, జలదంకి

గ్రామానికి తాగునీరు సజావుగా అందేలా పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. వాగులపై నిర్మించిన చప్టాల మరమ్మతుల విషయమై అధికారులకు ప్రతిపాదనలు పంపుతాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.

సమాచార స్రవంతి

### బంగారం ధరలు

| | |
|---|---|
| గ్రాము ధర: (3 శాతం జీఎస్టీ కలిసిన ధర) | రూ. 7,519 |
| సవర ధర: | రూ. 60,152 |
| వెండి గ్రాము : | రూ. 103.40 |

### వెంకాబ్ కోళ్ల ధరలు

| | |
|---|---|
| బ్రాయిలర్ (రైతుధర) | 120 |
| రిటైల్ | 142 |
| లేయర్ | 115 |
| బ్రాయిలర్స్ | 206 |
| బ్రాయిలర్స్ స్కిన్‌లెస్ | 234 |
| లేయర్ మాంసం | 195 |
| **నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్** | |
| బ్రాయిలర్ | 132 |
| లేయర్ | 115 |
| బ్రాయిలర్స్ | 236 |
| బ్రాయిలర్స్ స్కిన్‌లెస్ | 262 |
| లేయర్ మాంసం | 195 |

## ప్రజలతో మమేకమై పనిచేయాలి: ఆర్డీవో



సూచనలిస్తున్న ఆర్డీవో వంశీకృష్ణ

**బిట్రగుంట :** ప్రజలతో మమేకమై పనిచేస్తే సమస్యలు పరిష్కారమవుతాయని కావలి ఆర్డీవో వంశీకృష్ణ పేర్కొన్నారు. సోమవారం బోగోలు తహసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రెవెన్యూ కార్యదర్శులు, కార్యాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు. దస్త్రాలు పరిశీలించి సూచనలు చేశారు. గోడలు నెమ్మళ్ళిన తీరుపై ఆరా తీశారు. ఆయన వెంట తహసీల్దారు సురేష్‌బాబు, పరిపాలనాధికారులు భరత్, రీసర్వే డిప్యూటీ తహసీల్దారు గీత, సర్వేయర్ శ్రీనివాసులు రెడ్డి, ఆర్ఐ వాజిద్ తదితరులు ఉన్నారు.

# కావలి

• కావలి • ఉదయగిరి • కందుకూరు

## జనవరిలోపు పుర ఎన్నికలు: కృష్ణారెడ్డి

**కావలి:** నౌదరిపాలెన్ని పురపాలకం నుంచి విడదీస్తూ సీఎం చంద్రబాబు సమ్మతించినందున జనవరిలోపు ఎన్నికలు జరుగుతాయని ఎమ్మెల్యే డి.కృష్ణారెడ్డి తెలిపారు. మద్యం వ్యాపారులు తనను కలవదలిచిన... స్పష్టంచేశారు. సోమవారం హిజ్రాలు ఆయన్ను కలిసి సమస్యలపై మొరపెట్టుకున్నారు. దీంతో ఎమ్మెల్యే తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం పలువురికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై విమర్శలు చేశారు.

## మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు: 70939 81624, ఉదయగిరి : 80085 73944

**సమస్య :** పట్టణం నుంచి విజయవాడ, తిరుపతికి బస్సులు నడపాలి. **- శ్రీనివాసరావు, రాజా వీధి**

**సమాధానం :** ప్రతిరోజు ఉదయాన్నే ఐదు సర్వీసులు తిరుపతికి నడుపుతున్నాం. విజయవాడ మా సెక్టార్ పరిధిలోకి రాదు. ఇతర డిపోల బస్సులు పట్టణం నుంచే వెళుతున్నాయి. **- రాపూరి శ్రీనివాసులు, డిపో మేనేజర్, కావలి - కావలి, న్యూస్‌టుడే**

? మండలంలోని తెట్టు తూర్పుపాలెంలో వీధి దీపాలు వెలగడం లేదు. **- వై.సింహాద్రి**

✓ పరిశీలించి వెలిగించే ఏర్పాట్లు చేస్తాం. **- మార్టిన్, పంచాయతీ కార్యదర్శి -గుడ్లూరు, న్యూస్‌టుడే**

? వర్షాలతో దోమలు అధికమై వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. **- శ్రీనివాసులు, గ్రామస్థుడు**

✓ దోమల నివారణకు వారంలోపు ఫాగింగ్ చేయిస్తాం. **- మాధవరావు, పంచాయతీ కార్యదర్శి, లింగసముద్రం - లింగసముద్రం, న్యూస్‌టుడే**

? జగనన్న రీసర్వేలో పొలం విస్తీర్ణం తక్కువగా నమోదు చేశారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. **- కోటయ్య, నలదలపూరు**

✓ వీటి పరిష్కారానికి ఈ నెల 23 నుంచి జరిగే గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. **- అబ్దుల్ హమీద్, తహసీల్దారు - న్యూస్‌టుడే, వలేటివారిపాలెం**

## నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

**వరికుంటపాడు, న్యూస్‌టుడే:** గ్రామంలో విద్యుత్తు స్తంభాల ఏర్పాటు, మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డిస్కం ఏఈ ఖుద్దూస్‌బాషా తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

## వెల్లివిరిసిన ప్రతిభ



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

**కావలి, న్యూస్‌టుడే:** పట్టణంలోని భాష్యం పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశాలపై వ్యాసరచన పోటీలు ఏర్పాటుచేశారు. వీటిలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ఎస్.మహాలక్ష్మి, పి.చంద్రిక, ఎ.లక్ష్మీ ప్రణీత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయులు రాజేశ్ బహుమతులు అందజేశారు.




విజేతలతో భాష్యం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్

**మొత్తం ఇళ్లు: 2,212 | చేరిన వారు: 400 | మొత్తం విస్తీర్ణం: 20.9 ఎకరాలు**

## టిడ్కో.. సమస్యలు చూస్కో



ఇళ్ల మధ్య నిలిచిన నీరు

న్యూస్‌టుడే, కావలి

పట్టణంలోని మద్దూరుపాడులో టిడ్కో సముదాయంలో సదుపాయాల కొరత వెంటాడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్ల మధ్య నీరు నిలిచిపోయింది. జలవనరుల శాఖ అధికారులు నీటిని వెలుపలకు పంపించేందుకు చర్యలు తీసుకున్నా ఉపయోగం లేకుండాపోయింది. దీంతో నివాసాల్లోకి విషపురుగులు వస్తున్నాయి. సముదాయం చుట్టూ రూ.2 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మించాల్సి ఉంది. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా మంజూరు కాలేదు. దీన్ని నిర్మిస్తే వర్షాలొచ్చినప్పుడు వరద నీటికి అడ్డుకట్ట పడుతోంది. పట్టణంలో 20.9 ఎకరాల విస్తీర్ణంలో (జీ+3) విధానంలో 66 బ్లాకులుగా నిర్మించారు. ఒక్కో బ్లాకులో 32 ఇళ్లు చొప్పున గతంలో తెదేపా అధికారంలో ఉండగా నిర్మించారు. ఇవి పూర్తయి లబ్ధిదారులకు అప్పగించే సమయంలో ఎన్నికలు రావడంతో వైకాపా అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వ కాలం ముగిసే సమయంలో లబ్ధిదారులకు కేటాయించారు.

### లబ్ధిదారులు చేరిక

ఇళ్ల నిర్మాణం పూర్తయి ఆరేళ్లు దాటింది. వీటిని ఏడాదిన్నర క్రితం లబ్ధిదారులకు స్వాధీనం చేసే ప్రక్రియ ప్రారంభించారు. సదుపాయాలు లేకపోవడంతో వీటిలో చేరేందుకు ఎంతోమంది వెనుకడుగు వేస్తున్నారు. వసతుల పరంగా ధీమా ఏర్పడితేనే మరింతమంది లబ్ధిదారులు ఉండేందుకు ముందుకొస్తారు.

### అరకొరగా..

సముదాయంలో సౌకర్యాలు అరకొరగా కల్పించారు. అంతర్గత సిమెంటు రోడ్డు, భూగర్భ మురుగునీటి కాలువలు, నిరంతర నీటి సరఫరా, విద్యుత్తు, ఉద్యానవనం, చిన్నారుల కోసం ఆటల సరంజామా వంటివి ఏర్పాటుచేస్తామని ప్రకటించినా సమకూరలేదు. ఇందులో విద్యుత్తు, నీటి సరఫరాపరంగా అంశాలను పరిష్కరించకపోవడం లబ్ధిదారులకు శాపంగా మారుతోంది. నిత్యం 15 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మించాల్సిన మురుగునీటి శుద్ధి కేంద్రం మాత్రమే నిర్మించారు. దీన్ని సరిగా నిర్వహించడం లేదు.

**నీరు తరలిస్తున్నాం : జంపాని కిరణ్, సహాయ ఇంజినీర్, జలవనరుల శాఖ, కావలి**

అక్కడి వర్షపు నీరంతా ఆనెమడుగు చెరువులోకి చేరాలి. ఆ చెరువు అలుగులు మరమ్మతులకు గురయ్యాయి. వాటిని బాగు చేయించాం. ఈ నీరు అందులోకి తరలిస్తున్నాం.

**సమస్యలన్నీ పరిష్కరిస్తాం : శ్రావణ్‌కుమార్, కమిషనర్, కావలి పురపాలక సంఘం**

టిడ్కోలో సమస్యలన్నీ పరిష్కరించేలా కృషి చేస్తున్నాం. లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం. రిటైనింగ్ వాల్ నిర్మాణ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం.

## ఉరుస్తోన్న స్లాబు

ఈ చిత్రం మండల పరిషత్ కార్యాలయంలోని అధికారులుండే గది. వర్షాలకు ఉరుస్తోంది. దీంతో అక్కడ ఉన్న కంప్యూటర్‌తో పాటు దస్త్రాలు తడిసిపోతున్నాయి. ఈ విషయమై ఏవో శేషసాయిని వివరణ కోరగా ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. **- న్యూస్‌టుడే, కొండాపురం, ఉదయగిరి**



## శిథిల భవనం.. బాగు చేస్తే ప్రయోజనం



ఇది పట్టణంలోని పాతూరు పోలేరమ్మ అరుగు, పురపాలకోన్నత పాఠశాలకు ఎదురుగా ఉన్న శిథిలమైన జలవనరుల శాఖ ఏఈ కార్యాలయ భవనమిది. మరమ్మతులకు గురికావడంతో అలాగే వదిలేశారు. దీంతో డీఈ, ఈఈల కార్యాలయంలో ఏఈ విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై జలవనరుల శాఖ సహాయ ఇంజినీర్ జంపాని కిరణ్ మాట్లాడుతూ నిధులు మంజూరైతే బాగు చేయించడమో, లేక కొత్తగా భవనం నిర్మించి వాడుకలోకి తీసుకొస్తామన్నారు. **- న్యూస్‌టుడే, కావలి**

## వామ్మో.. కాలనాగు



ఈ త్రాచు పామును చూశారా! ఇది పట్టణంలోని మద్దూరుపాడు టిడ్కో సముదాయంలోకి సోమవారం ఉదయం వచ్చింది. దీంతో అక్కడ నివసిస్తున్న వారంతా బెంబేలెత్తిపోయారు. కొద్దిరోజుల క్రితం నాగుపాము కూడా వచ్చింది. చుట్టూ పరిసరాలు అధ్వానంగా తయారవడంతో ఇలా వస్తున్నాయి. వీటిలో నివసించే వారు భయంభయంగా గడుపుతున్నారు. **- న్యూస్‌టుడే, కావలి**

## పూడిక తీత పనులు ప్రారంభం

రాళ్లపాడు జలాశయం ఎడమ కాలువలోని పూడికను సోమవారం నుంచి తొలగిస్తున్నట్లు జలాశయం అధికారులు తెలిపారు. వర్షాలకు ప్రాజెక్టులోకి 17 అడుగుల నీరు చేరింది. దీంతో సాగుకు రైతన్నలు సన్నద్ధమవుతుండడంతో పూడిక తొలగిస్తున్నారు. చీమలపెంట, గంగపాలెం, వాకమళ్లవారిపాలెం, పెంట్రాల, జంపాలవారిపాలెంలో 1500 ఆయకట్టు ఉంది. రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, లింగసముద్రం**



## పొంగిన ఎర్రవాగు



పట్టణ పరిసరాల్లో సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి ఎర్ర వాగు పొంగింది. ఇటీవల కాలంలో పొంగడం మూడోసారి. కొండముడుసుపాలెం, ఆనందపురం, చుట్టుగుంట రోడ్లలో రాకపోకలు నిలిచిపోయాయి. వాగులోకి దిగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించి చర్యలు తీసుకున్నారు. **- న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం**

## పోలీసు అమరవీరుల దినోత్సవం

**న్యూస్‌టుడే బృందం, కావలి, కందుకూరు, ఉదయగిరి, న్యూస్‌టుడే:** పోలీసు అమరవీరుల దినోత్సవం సోమవారం పోలీసులు ఘనంగా నిర్వహించారు. కావలి, కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని పోలీసుస్టేషన్ల పరిధిలో వీధుల్లో ప్రదర్శనలు చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన వారిని స్మరించుకున్నారు. కావలి డీఎస్పీ ఎం.శ్రీధర్, ఆయా ప్రాంతాల సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.




కావలిలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



కలిగిరి మెయిన్‌రోడ్డుపై విద్యార్థులు, పోలీసుల మానవహారం




విద్యార్థులు, పోలీసు సిబ్బందితో కలిసి ప్రదర్శన నిర్వహిస్తున్న ఎస్సై ఇంద్రసేనారెడ్డి

## నివేశన స్థలాల మంజూరుకు వినతి

**కందుకూరు పట్టణం :** కొద్దిపాటి వర్షం పడినా తాము నివాసం ఉంటున్న ప్రాంతంలోకి నీళ్లు చేరి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, నివాసయోగ్యమైన ప్రాంతంలో పట్టాలు మంజూరు చేయాలని ఉలవపాడు మండలంలోని కరేడు పంచాయతీ మర్రిచెట్టు సంఘం ఎస్టీలు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కోరారు. ఈమేరకు సోమవారం వినతిపత్రం అందజేశారు.

**రూ.80కోట్ల అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే**

**సీతారామపురం, న్యూస్‌టుడే :** ఉదయగిరి నియోజకవర్గంలో ప్రస్తుతం రూ.80 కోట్లమేర అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వెల్లడించారు. గుండుపల్లి, సీతారామపురం, బసినేనిపల్లి పంచాయతీల్లో సోమవారం పల్లె పండగ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయాపంచాయతీల్లో రూ.1.27 కోట్లతో నిర్మించనున్న సిమెంటు రహదారులకు శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన నాయకులు భోగినేని కాశీరావు, సీతారామపురం మండల తెదేపా అధ్యక్షుడు కప్పా ప్రభాకర్ రాజు, నాయకులు పాల్గొన్నారు.





పోటీలో పాల్గొన్న విద్యార్థులు.. విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం

## ప్రతిభకు పదును

**కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని నాగార్జున హైస్కూల్‌లో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. అందులో భాగంగా అంతర్జాలం వినియోగంతో కలిగే లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సీహెచ్ నవదీప్‌రెడ్డి ప్రథమ, ఎస్.కె.హీనా ద్వితీయ, జి.కిషోర్ తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు పాఠశాల హెచ్‌ఎం డి.బాలబ్రహ్మం బహుమతులు అందజేశారు.

## ట్రూఅప్ ఛార్జీల రద్దుకు డిమాండ్

**కావలి, న్యూస్‌టుడే:** విద్యుత్తు ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలని సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఈ విషయమై ఏపీఎస్పీడీసీఎల్ కావలి ఈఈ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం ఈఈ బెనర్జీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మధుసూదన్‌రావు, కృష్ణ, తిరుపాల్, బాబురావు, అరుణ, లక్ష్మి పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై నిరసన

**కందుకూరు పట్టణం :** స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎస్.ఎ.గౌస్ కోరారు. ట్రూఅప్ ఛార్జీల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ టి.శ్రీపూజకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు డి.రామ్మూర్తి, మున్వర్‌సుల్తానా, మల్లిక, పద్మ, రాయుడు పాల్గొన్నారు.

## జాతీయరహదారి పనుల పరిశీలన



రోడ్డు పనులు పరిశీలిస్తున్న భాజపా నాయకులు

**వలేటివారి పాలెం :** సింగరాయకొండ నుంచి మాలకొండ వరకు జరుగుతున్న 167-బి జాతీయ రహదారి పనులను భాజపా నాయకులు సోమవారం పరిశీలించారు. కందుకూరు నుంచి సింగరాయకొండ వరకు నాలుగు లైన్లుగా అభివృద్ధి చేయాలని, ఎర్రవాగు, బడేవారిపాలెం వద్ద పంది వాగుపై వంతెనలు ఏర్పాటుచేయాలని భాజపా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జి.హరిబాబు, జె.రాఘవులు, కొమ్మి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల్లోపే తూర్పు రాజగోపురం ప్రారంభం

**బిట్రగుంట, న్యూస్‌టుడే:** రానున్న బ్రహ్మోత్సవాల్లోపు తూర్పు రాజగోపురం ప్రారంభిస్తామని దాత, కావలి మాజీ ఏఎంసీ ఛైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నిర్మాణంలో ఉన్న గోపురానికి మహాద్వారబంధం ప్రతిష్ఠ పనులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 2.50 కోట్లతో చేపట్టిన ఈ రాజగోపురం పనులు అనివార్యకారణాలతో జాప్యం జరిగిందన్నారు. తాను రూపొందించిన మాస్టర్ ప్లాన్ ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి త్వరలో అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఈవో రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నీటి శుద్ధిలో ప్రమాణాలు పాటించడం లేదని ఫిర్యాదు

**కందుకూరు పట్టణం :** రాళ్లపాడు ప్రాజెక్టు నుంచి 100 గ్రామాలకు పైగా తాగునీరు సరఫరా జరుగుతోందని, ఆ నీటిని శుద్ధి చేయడంలో ప్రమాణాలు పాటించడం లేదని పట్టణ అభివృద్ధి సలహా కమిటీ నాయకులు సబ్‌కలెక్టర్ శ్రీపూజకు ఫిర్యాదు చేశారు. సోమవారం పట్టణంలోని ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దివి శివరామ్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

## సర్పంచి మృతికి నివాళి

**ఉలవపాడు :** మండలంలోని బద్దిపూడి సర్పంచి కూనం అనిల్‌రెడ్డి మృతదేహానికి పలువురు వైకాపా నాయకులు నివాళులర్పించారు. సోమవారం ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పనిచేసిన విశ్రాంత కలెక్టర్ విజయకుమార్ తదితరులు పరామర్శించారు.

## 'పాలకులు మారినా మారని విధానాలు'

**కందుకూరు పట్టణం :** ప్రభుత్వం, పాలకులు మారినా మద్యంపై వారి విధానాలు మారలేదని ఐద్వా నాయకురాలు ఎం.మున్వర్‌సుల్తానా ఆరోపించారు. పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు ఎస్.కె.మల్లిక, పద్మ, బి.ధనలక్ష్మి, సుభాషిణి, పెంచలమ్మ పాల్గొన్నారు.

# సంక్షిప్త సమాచారం

### మండల సభ వాయిదా

**బిట్రగుంట :** బోగోలు ఎంపీపీ మేకల సుజాతతో సహా సభ్యులందరూ గైర్హాజరవడంతో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఎంపీడీవో సుబ్రమణ్యం సభను ప్రారంభించేందుకు రాగా సభ్యులు రాలేదు. దీంతో వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

### వేరుసెనగలో దిగుబడి సాధించడంపై ప్రదర్శన

**ఉలవపాడు :** వేరుసెనగ సాగుపై సోమవారం కరేడు పంచాయతీలోని టెంకాయచెట్లపాలెం, బట్టీ సోమయ్యపాలెం గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త ప్రసాద్‌బాబు, వెంకటేష్, జ్యోతి, వ్యవసాయ శాఖ అధికారి తిరుమలజ్యోతి పాల్గొన్నారు.

### నగదుతో విద్యార్థి అదృశ్యం

**ఉదయగిరి :** మండలంలోని దుర్గంపల్లికి చెందిన విద్యార్థి గుమ్మల దశరథ ఆదివారం అదృశ్యమయ్యాడని అతడి తల్లి రాజేశ్వరి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కూరగాయల దుకాణంలో వ్యాపారులకు ఇచ్చేందుకు పెట్టిన రూ. 9 వేల నగదు తీసుకొని పోయాడని పోలీసులకు తెలిపారు.

### పార్టీ బలోపేతానికి కృషి

**దగదర్తి :** మండలంలో తెదేపా బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ చౌదరి కోరారు. సోమవారం దామవరంలో జరిగిన తెదేపా కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. మండల తెదేపా అధ్యక్షుడు హనుమంతరావు, నాయకులు శీనయ్య పాల్గొన్నారు.

### భూ ఆక్రమణను అడ్డుకున్న తహసీల్దారు

**ఉదయగిరి :** మండలంలోని ఆర్లపడియలో సీజేఎఫ్ఎస్ భూమిని కొందరు ఆక్రమణకు యత్నించడంతో గ్రామస్థుల సమాచారం మేరకు తహసీల్దారు సుభద్ర రెవెన్యూ సిబ్బందితో వెళ్లి సోమవారం అడ్డుకున్నారు. సర్వే నంబర్లు 46, 47లో సుమారు 28 ఎకరాల సీజేఎఫ్ఎస్ భూమి ఉంది. అందులో కొందరు ఆదివారం రాత్రి చెట్లు తొలగించి చదును చేయడంతో స్థానికులు సమాచారమందించారు. దీంతో అక్కడికి వెళ్లి చదును చేసిన భూముల్లో బోర్డులు ఏర్పాటు చేశారు.

### ఘాట్ రోడ్డు పూర్తి చేయాలని ఆందోళన

**ఉదయగిరి :** ఏళ్లగా అసంపూర్తిగా ఉన్న ఉదయగిరి- బండగానిపల్లి ఘాట్ రోడ్డును పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు వెంకటయ్య తదితరులు మాట్లాడారు.

## జైకా నిధులతో చెరువులకు మరమ్మతులు

**ఉదయగిరి, న్యూస్‌టుడే :** జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ ఏజన్సీ (జైకా) నిధులతో ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని పలు గ్రామాల చెరువులకు మరమ్మతులు చేపడుతున్నట్లు జలవనరుల శాఖ డీఈఈ కె.చంద్రమౌళి సోమవారం తెలిపారు. ఉదయగిరి చిన్న, పెద్ద చెరువులకు రూ.48 లక్షలు, గువ్వాడిలో రూ. 23, ఇస్కపల్లిలో రూ.27, కృష్ణంపల్లిలో రూ. 32, లింగమనేనిపల్లిలో రూ. 51 లక్షలతో మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు.

## వివాహం ఇష్టం లేక యువతి ఆత్మహత్యాయత్నం

**కావలి :** వివాహం చేసుకోవడం ఇష్టం లేని యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వైనమిది. పట్టణంలోని ఓ ప్రాంతానికి చెందిన యువతికి తల్లిదండ్రులు వివాహం చేయాలని నిర్ణయించారు. ఇష్టం లేకపోవడంతో సోమవారం హార్పిక్ తాగింది. స్పృహ కోల్పోవడంతో గమనించిన బంధువులు ప్రాంతీయాసుపత్రికి తరలించారు.

## డిప్యూటీ సీఎం చిత్రపటాలు పెట్టాలి

**కావలి :** ప్రభుత్వ కార్యాలయాల్లో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలను ఏర్పాటు చేయాలని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సమ్మను వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. సోమవారం కావలి ఆర్డీవో ఎం.వంశీకృష్ణ, డీఎస్పీ మాల్యాద్రి, తదితరులను కలిసి వినతిపత్రం అందజేశారు.

## 66 సారి రక్తదానం

**కావలి :** తెదేపా నాయకులు, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ ఛైర్మన్ కండ్లగుంట మధుబాబు 66వ సారి రక్తదానం చేశారు. సోమవారం పట్టణంలోని రెడ్‌క్రాస్‌భవన్‌లో రక్తమిచ్చారు.

## యువకులు.. ప్రాణదాతలు

న్యూస్‌టుడే, ఉదయగిరి



రక్తదానంతో ఆపద సమయంలో మరొకరి ప్రాణం నిలుస్తోంది. ఎంతోమందికి ఇది అందక ప్రాణాలు కోల్పోతున్నారు. దీన్ని గమనించిన పలువురు యువకులు ఉద్యమంగా చేస్తున్నారు. ఆపదలో ఉన్న వారికి రక్తమిచ్చి ప్రాణదాతలుగా మారుతున్నారు. ఇందుకు గ్రామీణులను చైతన్యం చేస్తున్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. స్వచ్ఛందంగా రక్తదానం చేస్తూ సమాజ సేవకులుగా గుర్తింపు పొందుతున్నారు.

**12 సార్లు రక్తదానం చేశా**

**ఎన్.సతీష్, ఉదయగిరి**



ఉదయగిరిలో పలు సందర్భాల్లో జరిగిన రక్తదాన శిబిరాల్లో 12 సార్లు ఇచ్చా. మనం చేసే రక్తదానం ఆపదలో ఉన్న వారికి ఉపయోగపడి ప్రాణాలను నిలుపుతుంది. ఈమేరకు నావంతుగా దానం చేస్తున్నా.

**అపోహలు వీడాలి**

**ఎల్.సామ్రాట్, ఉదయగిరి**



రక్తదానంతో ఆరోగ్యపరంగా సమస్యలు వస్తాయనే అపోహతో కొందరు వెనుకాడుతున్నారు. అవన్నీ అవాస్తవాలు. ఆరోగ్యవంతులు ఎవరైనా రక్తదానం చేయవచ్చు. ఏడుసార్లు ఇచ్చాను.



ఉదయగిరిలో రక్తదానం చేస్తున్న యువకులు

**ఎంతో మంచి కార్యం : కె.రవీస్, ఉదయగిరి**



ఎంతో మంచి కార్యం. ఆపదలో ఉన్న వారికి మనకు తెలియకుండానే ప్రాణ దానం చేసిన వారమవుతాం. ఉదయగిరిలో పలు సందర్భాల్లో జరిగిన రక్తదాన శిబిరాల్లో పాల్గొని తొమ్మిది సార్లు రక్తమిచ్చా. ప్రతిఒక్కరూ దీనికి ముందుకు రావాలి. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలి.

# కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు



మాట్లాడుతున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

## క్యాన్సర్ పరీక్షలు తప్పనిసరి

**బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు :** క్యాన్సర్ రహిత కోవూరు కోసం క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం నగరపంచాయతీలో ఉచిత క్యాన్సర్ పరీక్షల పింక్‌బస్సును సోమవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించి వైద్యం చేయించుకుంటే 90శాతం మరణాలు అరికట్ట వచ్చన్నారు. 35 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళ ఈ పరీక్షలు చేయించుకోవాలన్నారు. డైరెక్టర్ సుష్మ, వైద్యాధికారులు మనోజ్, పద్మజ, తెదేపా పట్టణ, గ్రామీణ అధ్యక్షులు ఎంవీ శేషయ్య, బత్తల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. కోవూరు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఆమె ఎమ్మెల్యే రైతులకు వరివిత్తనాలను పంపిణీ చేశారు. నాణ్యమైన వరి విత్తనాలు వినియోగించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు.

## వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

**ఆత్మకూరు, సంగం :** వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు వైద్యాధికారి ఖాదర్‌వలీ సూచించారు. ఆత్మకూరు అర్బన్ పీహెచ్‌సీని తనిఖీ చేశారు. వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ఆస్మా, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సంగంలోని రాళ్ల చెలిక ప్రాంతంలోని పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. మధుమేహ బాధితులకు బీసీజీ టీకా మందు విధిగా వేయాలని వైద్యులకు సూచనలు చేశారు.

## మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

**సమస్య:** ఆత్మకూరు పట్టణంలోని టెక్కే గుంత మసీదు ప్రాంతం నుంచి బట్టేపాడు రోడ్డు వరకు ఉన్న రహదారి అధ్వానంగా ఉంది. **- ఖాదర్‌బాషా, టెక్కే, ఆత్మకూరు**

**సమాధానం:** సీసీరోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేశాం. త్వరలో నిధులు మంజూరు కానున్నాయి. **- గంగా ప్రసాద్, పురకమిషనర్**

? విడవలూరు అంకమ్మగుడి ముందు రోడ్డుపై నీరు చేరి రాకపోకలకు అవస్థలు పడుతున్నాం. **- స్థానికుడు**

✓ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. **- ఎస్దాని బాష, పంచాయతీ కార్యదర్శి, విడవలూరు**

? చేజర్ల మండలం ఆదూరుపల్లి కూడలిలో సాయంత్రం వేళ పశువులు వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నాయి. దుకాణాల్లో జొరబడి సామగ్రి ధ్వంసం చేస్తున్నాయి. **- స్థానిక వ్యాపారులు, వాహనదారులు**

✓ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం: **ఎన్.ప్రభాకర్, ఎస్సై చేజర్ల**

? చేజర్ల మండలం పొదలకూరు- సోమశిల రహదారిలో నూతకివారి కండ్రిక సమీపంలో ఎండిన చెట్లు కూలే స్థితిలో ఉన్నాయి. **- సత్యనారాయణ, నూతకివారికండ్రిక**

✓ కూలే స్థితిలో ఉన్న చెట్లను తొలగిస్తాం. **- శ్రీనివాసులు ఏఈ ర.భశాఖ**

? బుచ్చిరెడ్డిపాళెం నగరపంచాయతీలోని మునులపూడి, కట్టుబడిపాళెం రోడ్లు దారుణంగా ఉన్నాయి. **- నీరజ**

✓ నిధులు మంజూరైన వెంటనే రోడ్లు వేయిస్తాం. **- చంద్రశేఖర్‌రెడ్డి, కమిషనర్**

? కొడవలూరు మండలంలోని యల్లాయపాళెంలో రోడ్లు సక్రమంగా లేవు. **- శేఖర్‌రెడ్డి**

✓ నిధులు మంజూరైన వెంటనే రోడ్లు మరమ్మతులు చేయిస్తాం. **- సాయిప్రసాద్, ఈవోపీఆర్డీ**

# అంతర్గత రోడ్లు.. నరకానికి నకళ్లు



**కోవూరు పట్టణంలోని రాళ్లమిట్టకాలనీలో అంతర్గత దుస్థితి ఇది. పదేళ్ల క్రితం ఇక్కడ సిమెంటు రోడ్డు నిర్మించారు. కానీ అప్పటి నుంచి రహదారికి కనీసం మరమ్మతులు చేయకపోవడంతో మొత్తం పగిలిపోయింది. నడవలేకున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేయించాలని పంచాయతీ అధికారులను ఎన్నోమార్లు విన్నవించినా ఉపయోగం లేకుండా పోయిందని వాపోతున్నారు.**



**కోవూరు పట్టణంలోని గుమ్మళ్లదిబ్బకాలనీలో రోడ్డు ఇది. కాలనీ ఏర్పడి ఆరు దశాబ్దాలు కావస్తున్నా ఇక్కడ కనీస మౌలిక వసతులను కల్పించడంలో గత పాలకులు నిర్లక్ష్యం వహించారు. దీంతో కాలనీలో జనాభా పెరిగినా అభివృద్ధిలో మాత్రం వెనకడుగులో ఉంది. వర్షాలు వస్తే రహదారులు బురదమయంగా మారుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు.**

**కోవూరు, న్యూస్‌టుడే:** కోవూరు పట్టణంలో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. గత ఐదేళ్ల కాలంలో పంచాయతీలకు ఎలాంటి నిధులు రాకపోవడంతో మౌలిక వసతులు కల్పించలేని దుస్థితి ఏర్పడింది. ఏళ్లక్రితం కాలనీలు ఏర్పడిన ఇంత వరకు కనీసం రహదారులు నిర్మించకపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వానా కాలం వస్తే చాలు అడుగు బయట పెట్టలేకున్నామని చెబుతున్నారు. గుమ్మళ్లదిబ్బ, రాళ్లమిట్ట, జంగం వీధి, సత్రం వీధి, రజక వీధి, శాంతినగర్, సెయింటు పాల్ స్కూల్ వీధి, విఘ్నేశ్వరపురం కాలనీ,చుండుగుంట కాలనీ, గాంధీజనసంఘం, ఎన్ఎస్సార్ కాలనీ, నందల గుంట కాలనీ, కొత్తకాలనీలలో రోడ్లన్నీ దారుణంగా ఉన్నాయి. వర్షాలు వచ్చిన ప్రతిసారి రోడ్లపై నీరు చేరుతుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పల్లెపండగ కార్యక్రమంలో సుమారు 82 లక్షలతో పనులు చేపట్టేందుకు శిలాఫలకాలు ప్రారంభించడంతో ప్రజల్లో ఆశాభావం నెలకొంది. త్వరలోనే పనులు చేపట్టి తమ కష్టాలను గట్టెక్కించాలని ప్రజలు కోరుతున్నారు.

### ప్రాధాన్యత క్రమంలో పనులు

ప్రాధాన్యత క్రమంలో కోవూరు పట్టణంలో రోడ్ల నిర్మాణ పనులు చేపడతాం. పంచాయతీరాజ్‌శాఖ అధికారులతో అంచనాలు తయారు చేసి అన్ని ప్రాంతాల్లో నిర్మించేందుకు కృషి చేస్తాం. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీహరిరెడ్డి, ఎంపీడీవో,కోవూరు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

## ప్రతిభ చాటి.. విజేతలుగా నిలిచి



బహుమతులు అందుకుంటున్న విజేతలు

**ఆత్మకూరు, న్యూస్‌టుడే:** స్థానిక రెయిన్‌బో ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభ పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగం వల్ల కలిగే లాభనష్టాలు.. విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8,9,10 విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వి.శ్రీకృష్ణ(ప్రథమ), వై. లక్ష్మీప్రణవి(ద్వితీయ), కె. జీవన్ సాయి(తృతీయ) స్థానాల్లో నిలిచారు. విజేతలకు కరస్పాండెంట్లు కె. శ్రీనివాసులునాయుడు, వి. నరసింహనాయుడులు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు లక్ష్మీప్రసన్న, కాత్యాయని తదితరులు పాల్గొన్నారు.

## తీరిన అగచాట్లు

స్థానిక కెనరా బ్యాంకు సమీపంలో నెల్లూరు ముంబయి జాతీయరహదారిపై భారీ గుంత ఏర్పడింది. రాకపోకలకు అత్యంత అసౌకర్యంగా ఉండడంతో సీఐ కె.వేమారెడ్డి స్పందించారు. సోమవారం యంత్రసాయంతో అక్కడ గుంతని పూడ్పించడంతో పాటు నీటి నిల్వ లేకుండా చర్యలు చేపట్టారు. ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. **- న్యూస్‌టుడే, సంగం**



## భవనంపై కూలిన చెట్టు



పొదలకూరు మారుతీనగర్‌లో పోలీసు సిబ్బంది క్వార్టర్ల వద్ద ఉన్న భారీ చెట్లు చిన్న గాలికి చెట్లు కూలిపోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు ఇటీవల ఒక పెద్ద చెట్టు కూలి ఇంటిపై పడింది. అదృష్టవశాత్తు క్వార్టర్లలో నివాసం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. నీడనిచ్చే పెద్దచెట్లు ఇలా కూలిపోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న వాటిని తొలగించాలని కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటాని సీఐ రాంబాబు తెలిపారు. **- న్యూస్‌టుడే, పొదలకూరు**

## పోలీసు అమర వీరులకు నివాళి

**ఆత్మకూరు, అనుమసముద్రంపేట, సంగం, కలువాయి, రాపూరు, న్యూస్‌టుడే:** ఆత్మకూరు పట్టణంలో పోలీసు అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా సోమవారం ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీఐ గంగాధర్ ఎస్సైలు జిలానీ, సాయిప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఏఎస్‌పేటలో ఎస్సై సైదులు ఆధ్వర్యంలో బస్టాండు వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. సంగంలో అమరవీరులకు జేజేలు పలుకుతూ ప్రదర్శన నిర్వహించారు. సీఐ కె.వేమారెడ్డి, ఎస్సై పి.రాజేష్ తదితరులు ఉన్నారు. కలువాయి బస్టాండ్ కూడలిలో బలిమెల ఘటనలో అమరుడైన అనకర్ల కేశవులు స్తూపం వద్ద రాపూరు సీఐ విజయ్ కృష్ణ, కలువాయి ఎస్సై సుమన్, సిబ్బంది నివాళులర్పించారు. రాపూరులో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ర్యాలీ చేశారు. ఎస్సై వెంకటరాజేష్ తదితరులు ప్రసంగించారు.







సంగం : విద్యార్థులు, పోలీసు అధికారుల ర్యాలీ.. కలువాయి : అమరవీరుడు కేశవులు స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు... రాపూరులో..

## అనంతసాగరంలో గుప్తనిధుల తవ్వకాలు?

**అనంతసాగరం :** స్థానిక చెరువు కట్ట కింద గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు గ్రామస్థులు అనుమానిస్తున్నారు. సోమవారం చెరువు వద్దకు కొందరు యువకులు వెళ్లగా అక్కడ గుంతలు తవ్వి ఉండటాన్ని గమనించారు. గతంలో చెరువు వద్ద గొల్లభామ అమ్మవారు ఆలయ సమీపంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన సంఘటనలున్నాయి.

## దివ్యాంగులు, వయోవృద్ధులకు ప్రత్యేక శిబిరం

**తోటపల్లిగూడూరు :** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం కేంద్ర ప్రభుత్వం సంస్థ కాపోజిట్ రీజనల్ కేంద్రం వారి ఆధ్వర్యంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో వెంకటేశ్వరరావు తెలిపారు. అవయవ లోపాలను సరిదిద్దుకునేందుకు శిబిరాలను ఏర్పాటు చేశాయన్నారు. మూడు చక్రాల బండ్లు, వినికిడి యంత్రాలు, తదితర ఉపకరణాలకు అందజేస్తామని తెలిపారు.

# వెంకటగిరి నియోజకవర్గ సమాచారం

## 25న ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం

**కలువాయి :** మండలంలోని కుల్లూరు గ్రామం శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 25వ తేదీన మూలవిగ్రహ పీఠం, ఒంటి వాహనం, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు జరగనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. పురాతన ఆలయం కావడంతో శిథిలావస్థకు చేరింది. గ్రామవాసి చల్లా సీతారాం దంపతులు భక్తుల సహకారంతో మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, నళినమ్మ దంపతుల ఆధ్వర్యంలో దేవాలయ జీర్ణోద్ధరణ పనులు చేస్తున్నారు.

## మృతికి సంతాపం

**రాపూరు, న్యూస్‌టుడే:** రాపూరు సమితి మాజీ అధ్యక్షుడు పాపకన్ను రాజశేఖర్‌రెడ్డి మృతిపట్ల పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన స్వగ్రామమైన వేపినాపిలో అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి విక్రమ్‌రెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, తిరుపతి జిల్లా వైకాపా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు జడ్పీ ఛైర్మన్ ఆనం అరుణమ్మ తదితరులు పాల్గొని నివాళులర్పించారు. తెదేపా వైకాపా, బాజపా, జనసేన ,ఎమ్మార్పీఎస్ నాయకులు సంతాపం ప్రకటించారు.

## తెల్లరాయి తరలిస్తున్న ట్రాక్టర్ల స్వాధీనం

**సైదాపురం, న్యూస్‌టుడే:** సైదాపురం ప్రాంతంలో తెల్లరాయిని అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కాంతికుమార్ పేర్కొన్నారు. తిప్ప ప్రాంతం నుంచి తెల్లరాయిని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.


## భూములపై హక్కులు కోల్పోయాం

**చేజర్ల :** గత ప్రభుత్వ హయాంలో చేసిన రీసర్వే కారణంగా పలువురు భూమి హక్కులు కోల్పోయారని నాగులవెల్లటూరు, కాలాయపాలెం గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టాలిచ్చి రెవెన్యూ దస్త్రాల్లో పేర్లు నమోదు చేసి భూములు ప్రస్తుతం లేకుండా పోయాయని సోమవారం నిర్వహించిన గ్రామసభలో వివరించారు. పరిశీలన చేసి యథాతథంగా భూములపై హక్కులు పునరుద్ధరించాలని అధికారులను కోరారు.

## వైభవంగా గంధోత్సవం

**అనుమసముద్రంపేట :** ఏఎస్‌పేట మండలం రాజవోలులో సోమవారం ఘనంగా గ్యార్వీ ఏ షరీఫ్ మహబూబ్‌సుభానీ గంధ మహోత్సవం వేడుకగా జరిగింది. వాయిద్యాల మధ్య జెండా ఉత్సవం నిర్వహించారు. అనంతరం దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గంధాన్ని భక్తులకు పంపిణీ చేశారు.

# అభివృద్ధిలో భాగస్వాములుకండి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఆనం రామనారాయణరెడ్డి

**ఆత్మకూరు, న్యూస్‌టుడే:** ఆత్మకూరు నియోజకవర్గం అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. సోమవారం నెల్లూరులోని ఆయన నివాసంలో పురపాలకం పరిధిలోని నాయకులతో సమావేశమయ్యారు. అభివృద్ధి పనులపై చర్చించారు. పట్టణంలో వీధి దీపాలు, సీసీ రోడ్లు, సైడు కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడతామన్నారు. రూ. 9కోట్లతో తాగునీటి పథకం నిర్మిస్తామన్నారు. నియోజకవర్గానికి చెందిన 26 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 16. 55లక్షల నగదు చెక్కులను అందజేశారు. అనంతరం ఎన్‌డీసీసీబీ మాజీ అధ్యక్షుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి, కిమ్స్ ఈడీ టి. గిరినాయుడులకు తెదేపా జీవితకాల సభ్యత్వాలను అందజేశారు. అనంతరం ఆత్మకూరు ఆర్డీవో పావని, డీఎస్పీ వేణుగోపాల్, కమిషనర్ గంగా ప్రసాద్‌లతో సమావేశమయ్యారు. క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. అనంతసాగరం మండలంలో ఈనెల 28న నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు.

## ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న జట్లకొండూరు గ్రామస్థులు

**మనుబోలు, న్యూస్‌టుడే:** గ్రామంలోని ప్రభుత్వ భూములను ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ జట్లకొండూరు ఉప సర్పంచి ఆవుల తులసీరామ్ డిమాండ్ చేశారు. సోమవారం గ్రామస్థులతో కలిసి తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జట్లకొండూరు పంచాయతీ పరిధిలోని కుడితిపల్లి ప్రధాన రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూములను, శ్మశాన స్థలాన్ని, చెరువులను అధికార పార్టీకి చెందిన వ్యక్తి ఆక్రమించాడని అన్నారు. చెరువును ఆక్రమించి నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ బషీర్‌కు వినతిపత్రం అందజేశారు.

## రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమిరెడ్డి పూజలు



**మనుబోలు, వెంకటాచలం :** బద్దెవోలులో నూతనంగా నిర్మించిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జ్యోతి దంపతులు, ఆయన కుమారుడు రాజగోపాల్‌రెడ్డితో కలిసి స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు గాలి రామకృష్ణారెడ్డి, రామకృష్ణయ్య, సురేంద్రరెడ్డి తదితరులు ఉన్నారు. వెంకటాచలంలోని సర్వేపల్లి రోడ్డు కూడలి వద్ద ఉన్న బస్టాండ్‌ను ఎమ్మెల్యే సోమిరెడ్డి పరిశీలించారు. పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

## తెదేపా సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి

**మర్రిపాడు :** తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెదేపా మండల కన్వీనర్ జనార్దన్‌నాయుడు తెలిపారు. సోమవారం మర్రిపాడులో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. నాయకులు నారాయణ, సురేంద్రరెడ్డి, చిన్నారెడ్డి, పాల్గొన్నారు.

## సులభతర అవగాహనకు 'సాంకేతిక పుస్తకం'

**కోవూరు :** గంగవరంలోని గీతాంజలీ ఇంజినీరింగ్ కళాశాలలో 'సాంకేతిక పుస్తకం' ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠ్యాంశాలపై సులువుగా అవగాహన కల్పించేందుకు ఈ పుస్తకం రూపొందించామన్నారు. రోబోటిక్స్, ఆటోమిషన్ సాంకేతికతతో పాటు వ్యవసాయ రంగంలో పంటఉత్పత్తికి దోహదపడే అంశాలు ఉన్నాయన్నారు. తనతో పాటు డాక్టర్ కె. పెంచలయ్య, డాక్టర్ కె. శ్రావణ్‌కుమార్, డాక్టర్ జి.సురేష్‌లు సంయుక్తంగా పుస్తక రచనకు తోడ్పడ్డారన్నారు. కళాశాల కార్యదర్శి సుధాకర్‌రెడ్డి వారిని అభినందించారు.

## రైలు ఢీకొని వృద్ధుడి మృతి

**కోవూరు :** మండలంలోని పడుగుపాడు రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతున్న గుర్తుతెలియని(70) వృద్ధుడు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ఈ సంఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుందని కావలి రైల్వే హెడ్ కానిస్టేబులు శ్యామ్ కుమార్ తెలిపారు. వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతుడి చొక్కా కాలరుపై మ్యాక్స్ టైలరు కోవూరు అని రాసి ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**మర్రిపాడు :** మర్రిపాడు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారిపై సోమవారం ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు మర్రిపాడు చెందిన మధుబాబు యూటర్న్ తీసుకుంటుండగా బెడుసుపల్లి గ్రామానికి చెందిన పెంచల నరసింహులు ఢీకొట్టారు. దీంతో ఇద్దరు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆత్మకూరులోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## నందవరం శివాలయంలో చోరీ

**మర్రిపాడు :** నందవరం శివాలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ నిర్వాహకుడు మోహన్‌రెడ్డి వివరాల మేరకు గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి ఆలయం తాళాలు ధ్వంసం చేసి హుండీని తీసుకెళ్లారు. పగలగొట్టేందుకు ప్రయత్నించగా తెరుచుకోకపోవడంతో పనిముట్లులాంటిది ఉపయోగించి హుండీలో ఉన్న రూ.2 లక్షల నగదు అపహరించారు. గ్రామం సమీపంలోని ముళ్ల పొదల్లో హుండీని పడేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

**బుచ్చిరెడ్డిపాళెం :** తల్లి, చెల్లిని బస్సు ఎక్కించిన యువకుడు ఆపై అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల సమాచారం మేరకు.. మునులపూడికి చెందిన పుట్టా రాకేష్ ఈనెల 18న తల్లి, చెల్లి నెల్లూరుకు వెళ్లాల్సి ఉండగా బస్సు ఎక్కించాడు. ఆ తర్వాత ఇంటికి రాలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదుచేయగా సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

## అత్యాచార యత్నం.. రిమాండ్ విధింపు

**రాపూరు :** చెర్లోపల్లిలో ఓ యువతిపై అదే గ్రామానికి చెందిన శ్రీహరి అనే యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ మేరకు నిందితుడ్ని సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై వెంకటరాజేష్ పేర్కొన్నారు.

## మద్యం మత్తులో దాడి

**విడవలూరు :** మద్యం మత్తులో ఓ వ్యక్తి పానీపూరి దుకాణదారుడిపై దాడి చేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు వివరాల మేరకు విడవలూరుకు చెందిన వంశీ అనే వ్యక్తి మద్యం తాగి అంకమ్మగుడి వద్ద పానీపూరీ దుకాణం వద్దకు వచ్చి గోబీ కావాలని అడిగాడు. దుకాణాదారుడు మురళి ఆలస్యం అవుతుందని చెప్పడంతో ఆగ్రహించి దాడి చేశాడు. అడ్డొచ్చిన దుకాణాదారుడి భార్యపై కూడా దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

# ఆక్రమణల చెరలో చెరువులు



అనుమసముద్రం చెరువు లోతట్టు ప్రాంతంలో ఆక్రమించి వేసిన కంచె

**అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే:** మండల పరిధిలో పలు చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయి. వీటిలో అధికంగా వర్షాధారిత చెరువులే కావడంతో నీటి నిల్వ కాలం తక్కువగా ఉంటుంది. ఇదే అదనుగా పలువురు చెరువుల లోతట్టు భూములను ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. మరి కొందరు ఏకంగా అమ్మేసుకుంటున్నారు. దీంతో చెరువులకు నీరందుతున్నా.. ఆక్రమణల వల్ల నీటి నిల్వ స్థాయి తగ్గుతోంది. ఈ ప్రభావం పంటల సాగుపై చూపుతోంది. పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

ఏఎస్‌పేట మండలంలో మొత్తం 30 చెరువులున్నాయి. వాటి ద్వారా సుమారు పదివేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందుతుంది. పెద్దబ్బీపురం చెరువు లోతట్టు ప్రాంతం ఆక్రమణకు గురయింది. సమారు ఇరవై ఎకరాలకు పైగా కబ్జాచేసేశారు. అనుమసముద్రం చెరువులో తట్టు ప్రాంతంలో సుమారు పాతిక ఎకరాలు, చౌటభీమవరం చెరువు లోతట్టు ప్రాంతంలో సుమారు 50 ఎకరాలకు పైగా ఆక్రమణలు చేసుకుని కంచెలు సైతం వేసుకున్నారు. హసనాపురం చెరువు, పొనుగోడు, కాకర్లపాడు తదితర చెరువులను కబ్జా చేసేశారు.

### పట్టాలు సైతం తెచ్చుకున్నారు

ఆక్రమణ దారులు కొందరైతే గతంలో రెవెన్యూ అధికారుల సాయంతో చెరువు ప్రాంతాలకు పట్టాలు సైతం తెచ్చుకుని స్వేచ్ఛగా సాగు చేసుకుంటుండటం విశేషం. వాటిలో హసనాపురం చెరువు ఒకటి. చౌటబీమవరం రైతులు పలు మార్లు తమ చెరువులో ఆక్రమణలు జరిగాయని తొలగించాలని అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన కరవైందని వాపోతున్నారు. ఇటీవల వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆక్రమణలతో చెరువుల్లో నీటి నిల్వ ఏ మేరకు ఉంటుందోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చెరువులు రెండుసార్లు నిండితే గాని పంటలు పండని పరిస్థితి ఉంది. ఏటా ఇదే పరిస్థితి ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు.

### పరిశీలించి చర్యలు తీసుకుంటాం

చెరువులను ఆక్రమించి సాగు చేయడం చట్టారీత్యా నేరం. తమ దృష్టికి తీసుకువస్తే ఆక్రమణలకు గురైన చెరువులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

– పెంచలరావు, ఏఈ, ఇరిగేషన్



కబ్జాకు గురైన చౌటభీమవరం చెరువు

# నెల్లూరు

•నెల్లూరు • నెల్లూరు గ్రామీణం



చెక్కు అందిస్తున్న ఆర్డీవో నాగ సంతోష్ అనూష

## పరిహారం అందజేత

**నెల్లూరు(నవాబుపేట), న్యూస్‌టుడే:** వెంకటాచలం మండలం కనుపూరు బిట్ 2కు చెందిన అంబూరు రాధా అనే మహిళకు రూ.7,52,077 పరిహారం చెక్కును నగరంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో నాగసంతోష్ అనూష సోమవారం అందజేశారు. ఓబులవారి పల్లె, కృష్ణపట్నం రైల్వేలైను నిమిత్తం సేకరించిన 200 ఎకరాల గజాల ఇంటి స్థలానికి సంబంధించి ఈ పరిహారాన్ని అందజేశారు.

## సచివాలయాల్లో అవసరానికి మించి ఉద్యోగులు

**నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే:** గ్రామ పంచాయతీకి ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసే సచివాలయ సిబ్బందిని అను సంధానం చేయాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్ కోరారు. సోమవారం కలెక్టర్ ఒ.ఆనంద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రతి సచివాలయంలో 11 మంది ఉద్యోగులను నియమించి, వారిపై సరైన పర్యవేక్షణ, నియంత్రణ లేక తీవ్ర గందరగోళం తయారైందన్నారు. చాలా పంచాయతీల్లో రెండు నుంచి అయిదు ఏర్పాటు చేశారని, అవసరం కన్నా.. మించి ఉద్యోగులు ఉన్నందున పని లేకుండా పోయిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు టీకే వీవాస్, నాగేంద్రప్రసాద్‌రెడ్డి, వెంకటేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సర్పంచుల సంఘం నాయకులు

## ప్రారంభ దశలో గుర్తిస్తే క్యాన్సర్ నయం



మహిళకు బాక్సు అందజేస్తున్న డాక్టర్ లక్ష్మి

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే:** ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తించి, చికిత్స చేయడం వల్ల రొమ్ము క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేయవచ్చని రెడ్‌క్రాస్ సంస్థ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.నాగేశ్వరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.లక్ష్మి తెలిపారు. నగరంలోని రెడ్‌క్రాస్ సంస్థ క్యాన్సర్ ఆసుపత్రిలో రోగుల సహాయకులకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన సదస్సు సోమవారం జరిగింది. 30 సంవత్సరాలు దాటిన స్త్రీలు సంవత్సరానికి ఒకసారి స్కాన్, 40 సంవత్సరాలు దాటిన వారు రొమ్ముకు మామోగ్రామ్ ఎక్స్‌రేను తీయించుకోవాలన్నారు. కార్యక్రమంలో రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ గీతా ఉషశ్రీ, మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ ఎం.హేమంత్, రేడియాలజిస్ట్ డాక్టర్ హరిత రాణి, పెథాలజిస్ట్ డాక్టర్ నందిత, పేషంట్ కౌన్సిలర్ కన్యాకుమారి, రెడ్‌క్రాస్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు వాకాటి విజయ్‌కుమార్ రెడ్డి, జనరల్ మేనేజర్ భక్తవత్సలరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆలకించండి.. కనికరించండి..

### ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితుల గోడు

**నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే:** కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగు లేదని.. పింఛను మంజూరు చేయాలని భూములు ఆక్రమించుకున్నారని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన బాధితులు.. కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు వినతులు అందించారు. విచారించి న్యాయం చేయాలని వేడుకున్నారు.

### కాలు లేదు.. దయచూపండి

– ఎలీషా, చెర్లోపాళెం కట్ట కింద



జనవరి నెలలో రోడ్డు ప్రమాదం జరిగి ఆసుపత్రిలో కాలు తీసేశారు. నాకు భార్య, అయిదేళ్ల లోపు బిడ్డలు ఇద్దరు ఉన్నారు. ఆర్థికంగా చితికిపోయా. కుటుంబం జరగడం కష్టంగా ఉంది. అధికారులు ఏదైనా సాయం చేస్తారని వచ్చాను. పింఛను అందించి ఆదుకోవాలి.

### ఇల్లు ఇచ్చారు.. పూర్తిచేయలేదు

– సీతమ్మ, గొట్టిపాళెం, మనుబోలు మండలం

నాకు రెండు కాళ్లు, చేతులు పనిచేయవు. పొలం ఆక్రమించుకున్నారు. తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదు. జగనన్న కాలనీలో ఇల్లు ఇచ్చారు. పూర్తి చేయకపోవడంతో వర్షాలకు ఇబ్బంది పడుతున్నాం. ఇంటిలోకి నీరు వస్తోంది. ఉండేందుకు ఇబ్బందిగా ఉంది.



### నిర్ణయంతో అందరికీ సమస్యే

– భాజమ్మ, లక్ష్మి తదితరులు
– ఇస్నపాక పల్లిపాళెం, బుచ్చిరెడ్డిపాళెం

బుచ్చిరెడ్డిపాళెం మస్జిద్‌కు ఆనుకుని పక్కన నారాయణ స్కూల్, ప్రాథమిక పాఠశాల, పిండి బడి, ప్రైవేటు ఆసుపత్రి, పోలేరమ్మ చెట్టు మధ్యలో బ్రాండీ షాపు ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారు. మహిళలు పిల్లలను పాఠశాలలకు తీసుకెళ్లాలంటే ఇబ్బంది పడాల్సి వస్తోంది. బ్రాందీ షాపును దూరంగా ఏర్పాటు చేయాలి.



### వైకాపా అండతో దొంగ డాక్యుమెంట్ల సృష్టి

– ఎం.చిన్నసుబ్బయ్య, చిన్నమస్తాన్‌రెడ్డి, రమణయ్య, వెంకటేశ్వర్లు– పొంగూరు కండ్రిగ

మాకు గ్రామంలో 1976లో సీజేఎఫ్‌ఎస్ భూములు ప్రభుత్వం మంజూరు చేసింది. అప్పటి నుంచి పొలం సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాం. 2018లో స్వాధీనలను రద్దు చేసి డీకేటీ పట్టా మంజూరు చేస్తామని చెప్పారు. ఓ వ్యక్తి దొంగ డాక్యుమెంట్లు సృష్టించి గత వైకాపా అండదండలతో మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. విచారించి న్యాయం చేయాలి.



## అర్జీలకు శాశ్వత పరిష్కారం

**నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే:** నెల్లూరు నగరపాలకసంస్థ పరిధిలోని స్థానిక సమస్యలను కమాండ్ కంట్రోల్ విభాగంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ ఫోన్ ద్వారా తెలియజేస్తే తక్షణమే స్పందించి ఫిర్యాదులను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు కమిషనర్ సూర్యతేజ తెలిపారు. సోమవారం కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం విభాగాల వారీగా రెవెన్యూ 1, ఇంజినీరింగ్ 5, పట్టణ ప్రణాళిక 7, ప్రజారోగ్య విభాగం 1, హౌసింగ్ 4 ఫిర్యాదులు అందుకున్నట్లు వివరించారు.

**ఫిర్యాదులకు హెల్ప్‌లైన్:** ఫిర్యాదుదారులు తమ సమస్యలను 94940 18118 నంబరుకు వాట్సాప్ ద్వారా గానీ, 0861-2356777, 2316777 హెల్ప్‌లైన్ సంబంధకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల లోపు తెలియజేయాలని కోరారు. అందుకున్న ఫిర్యాదులను కమాండ్ కంట్రోల్ సెంటరు ద్వారా సంబంధిత అధికారులకు తెలియజేసి తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ శర్మద, ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య, సిటీప్లానర్ కృష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ సూర్యతేజ

## అదనపు కమిషనర్‌గా నందన్

**నెల్లూరు(నగరపాలకసంస్థ):** నెల్లూరు నగరపాలకసంస్థ అదనపు కమిషనర్‌గా వైవో నందన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన మంగళగిరిలో డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. గతంలో అదనపు కమిషనర్‌గా ఏడాది పాటు పని చేశారు. అలాగే నుడా వైస్ ఛైర్మన్‌గా, గూడూరు కమిషనర్‌గా విధులు నిర్వహించారు. ఇక్కడ పని చేస్తున్న అదనపు కమిషనర్ శర్మదను మంగళగిరికి బదిలీ చేశారు.

## రైలు ఢీకొని విశ్రాంత ఉద్యోగి మృతి

**నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే:** ఫోనులో మాట్లాడుతూ రైలు పట్టాలు దాటే క్రమంలో రైలు ఢీకొని విశ్రాంత అటవీశాఖ ఉద్యోగి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. బీవీ నగర్‌లో అటవీ శాఖ విశ్రాంత ఉద్యోగి ప్రసాద్(62) నివాసం ఉంటున్నారు. ఆయన సోమవారం జిల్లా ప్రభుత్వాస్పత్రిలో మెడికల్ రీయింబర్స్‌మెంట్ పనులు చూసుకుని ఇంటికి బయల్దేరారు. ఫోనులో మాట్లాడుతూ కొండాయపాలెం రైల్వేగేటు దాటుతుండగా చెన్నై వైపు వెళ్లే రైలు వేగంగా ఢీకొని మృతిచెందారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై జి.మాలకొండయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

## మండల సర్వసభ్య సమావేశం రేపు

**నెల్లూరుగ్రామీణం, న్యూస్‌టుడే:** నెల్లూరు రూరల్ మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 23న ఉదయం నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శైలేంద్రకుమార్ ప్రకటనలో తెలిపారు. అన్నిశాఖల అధికారులు పాల్గొనాలన్నారు.

## ఇళ్ల తొలగింపు తగదు

**నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు నిలువ నీడ లేకుండా చేస్తోందని, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం 48వ డివిజన్ పొర్లుకట్ట వద్ద పేదల నివాసాలను తొలగించడాన్ని తెలుసుకుని అక్కడకు చేరుకుని బాధితులతో మాట్లాడారు. కార్యక్రమంలో వైకాపా మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు హంజా హుస్సేని, కార్పొరేటర్లు నాగార్జున, మహేష్, రాఘవరావు, నాయకులు నేతాజీ సుబ్బారెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. 13వ డివిజన్ హెచ్‌పీ గోడౌన్ సమీపంలో నాలుగు పార్కులసెంటరు వద్ద చేపడుతున్న అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూర్యతేజకు వినతిపత్రం అందించారు. పార్కు స్థలంలో తెదేపా నేతలు ఆక్రమణలకు తెరలేపుతున్నారని చర్యలు చేపట్టాలని కోరారు.





## వారం రోజులైనా చెత్త తీయరా?

నెల్లూరు నగరంలోని జెండావీధి ఆంధ్రాబ్యాంకు సమీపంలో భారీగా వ్యర్థాలు పేరుకుపోయాయి. వారం రోజులుగా తొలగించ లేదని స్థానికులు వాపోతున్నారు. చెత్తాచెదారం కుళ్లి దుర్వాసన వస్తోందని, వ్యాధులు ప్రబలే ఉన్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి ప్రతిరోజూ వ్యర్థాలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. కార్మికులను పంపి తొలగిస్తామని ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(పొదలకూరు రోడ్డు)



## రాత్రిపూట రాకపోకలు ప్రమాదమే



నగరం నడిబొడ్డున కొత్తహాలు ప్రాంతంలో రోడ్డు అధ్వానంగా తయారైంది. వర్షాలకు గుంతల్లో నీరు చేరి మడుగులా మారుతోంది. రాత్రిపూట గుంతలు కన్పించక ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని కోరుతున్నారు. గుంతలకు మరమ్మతులు చేయిస్తామని నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

## మ్యాన్‌హోల్ మూత సరిచేయలేరా?


నెల్లూరు గ్రామీణ పరిధిలోని శ్రీధర్‌రెడ్డి నగర్‌లో కొత్త డ్రైనేజీ వ్యవస్థ కోసం ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్ మూతలు సరిగా పెట్టలేదు. దీనివల్ల వాటిలో పాములు, విష పురుగులు చేరుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు సమస్య పరిష్కరించాలని చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు స్పందిస్తూ కొత్త డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అమలు కాలేదని, ప్రజా ఆరోగ్య శాఖాధికారులకు సమాచారం ఇచ్చి సమస్య పరిష్కరిస్తాం.

– న్యూస్‌టుడే, నెల్లూరు(దర్గామిట్ట)



## ఆర్చరీ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

**నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే:** ఇటీవల బెంగళూరులో సౌత్‌జోన్ స్థాయిలో జరిగిన ఆర్చరీ పోటీల్లో నెల్లూరు బ్రహ్మానందపురంలోని అనె న్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్ నాలుగో తరగతి విద్యార్థిని జి.గోష్మితారెడ్డి గోల్డ్‌మెడల్ సాధించింది. బాలికను సోమవారం పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు అభినందించారు.



గోష్మితారెడ్డి

## మద్యం దుకాణం తొలగించాలని ఆందోళన

**నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే:** తమ నివాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని జగదీష్ నగర్ ఏడోవీధిలో స్థానికులు సాయంత్రం ఆందోళనకు దిగారు. చిన్నపిల్లల పార్కు వైపు నుంచి జాతీయ రహదారి మీదకు వెళ్లే వాహనాలు అడ్డుకుని గంటకుపైగా నిరసన కార్యక్రమం చేపట్టారు. రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. బాలాజీనగర్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకుని స్థానికులకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు సంఘటనా స్థలానికి చేరుకుని ఎక్సైజ్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో స్థానికులు నిరసన విరమించారు.

## లక్ష దీపోత్సవానికి అంకురార్పణ

**నెల్లూరు (సాంస్కృతికం):** వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్తిక మాస లక్ష దీపోత్సవానికి వీఆర్సీ మైదానంలో సోమవారం అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని పూజలు నిర్వహించి స్తంభ ప్రతిష్ఠ చేశారు. ఆమె మాట్లాడుతూ నవంబరు 8,9,10 తేదీలలో లక్ష దీపోత్సవంజరుగుతుందన్నారు.



స్తంభ ప్రతిష్ఠ పూజలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

## మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
నెల్లూరు, గ్రామీణం
80085 50332
80085 74001

**సమస్య:** నెల్లూరు నగరం 20వ డివిజన్ కొండాయపాళెం హరిజనవాడ కాలనీలోని కాలువ పూడికతో నిండిపోయి మురుగునీరు ముందుకు కదలడం లేదు.
– నాయుడు వెంకటేశ్వర్లు

**సమాధానం:** కాలువలో పూడిక తీయిస్తాం.
– సూర్యతేజ, కమిషనర్

? అరవిందనగర్‌లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ప్రజలపై దాడులు చేస్తున్నాయి. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయంగా ఉంది. – సుందరయ్య

✓ కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? బాలాజీనగర్ ప్రధాన మార్గం సుబ్బారెడ్డి వాటర్‌ప్లాంట్ ఎదురుగా తమ వీధిలో మూడు సంవత్సరాలుగా రోడ్డు శుభ్రం చేయడం లేదు. – వి.శేషగిరిరావు

✓ కార్మికులను పంపి రోడ్డు శుభ్రం చేయిస్తాం. – డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

? బాలాజీనగర్ సీపీఎం కార్యాలయం వీధిలో కుళాయిల నుంచి తాగునీరు వృథాగా పోతోంది. చర్యలు తీసుకోవాలి. –శ్రీనివాసులు

✓ నీటి వృథాను అరికడతాం.
– సూర్యతేజ, కమిషనర్

– న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్, నవాబుపేట)

# ప్రతిభకు ప్రోత్సాహం

### 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

**నెల్లూరు(విద్య):** 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు సోమవారం నిర్వహించారు. నగరంలో మూడు పాఠశాలల్లో 'అంతర్జాల వినియోగం - విద్యార్థులపై సామాజిక మాధ్యమాల పాత్ర' అనే అంశంపై 8,9,10 తరగతుల విద్యార్థులకు పాఠశాలల స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. వేదాయపాళెంలోని లిల్లి లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీషు మీడియం స్కూలులో మొదటి స్థానంలో ఎన్‌జేవీ నిఖిలేశ్వర్, ద్వితీయ స్థానంలో ఎస్‌డీ అర్షియకౌషర్, తృతీయ స్థానంలో టి.షన్విత నిలిచారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఈ కృష్ణచైతన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



### శ్రీసాయి మహా విద్యాలయంలో..

**నెల్లూరు (ఏసీ నగర్):** వేదాయపాళెంలోని శ్రీసాయి మహా విద్యాలయం ఇంగ్లీషు మీడియం స్కూలులో జరిగిన పోటీల్లో మొదటి స్థానంలో ఎస్‌కే సునైనా, ద్వితీయ స్థానంలో వి.నిఖిత, తృతీయ స్థానంలో ఆర్.రష్మికారెడ్డి నిలిచారు. పాఠశాల కరస్పాండెంట్ టి.నారాయణ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.



### వీబీఆర్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో..

**నెల్లూరుగ్రామీణం, న్యూస్‌టుడే:** నెల్లూరు రూరల్ ముత్తుకూరు రోడ్డు నాలుగో మైలు కృషి నగర్‌లోని వీబీఆర్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో పోటీలు నిర్వహించారు. మొదటి స్థానంలో వై.అంజనా సౌమ్య, ద్వితీయ స్థానంలో డి.భవ్యశ్రీ, తృతీయ స్థానంలో ఎం.దివ్యశ్రీ నిలిచారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కె.శ్రీనివాసులురెడ్డి, ఏవో ఐ.శ్రీనివాసులురెడ్డి, పీఈటీ వి.వెంకట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.





# అయిదేళ్లూ నిర్లక్ష్యం.. రోడ్లు అధ్వానం

**నెల్లూరు (జడ్పీ), న్యూస్‌టుడే:** వైకాపా ప్రభుత్వ హయాంలో అయిదేళ్లపాటు నగర పరిధిలోని ర.భ., నగర కార్పొరేషన్ రోడ్లు పట్టించుకోలేదు. నగరపాలక పరిధిలో ఎన్నికల ముందు కేవలం ఓట్ల కోసం కొన్ని డివిజన్ల పరిధిలో నిర్మించి మిగిలిన వాటిని పట్టించుకోలేదు. కొన్ని ప్రాంతాల్లో బాగున్న రోడ్లపై కొత్తవి నిర్మించారని ఆరోపణలు వచ్చాయి. ర.భ. శాఖ అధికారులు శాశ్వత పనులు చేయక పోగా.. అరకొరగా ప్యాచ్ పనులు చేసి కాలం గడిపేశారు. కొత్త ప్రభుత్వం వచ్చి రోడ్ల మరమ్మతులకు అంచనాలు తయారుచేసి నివేదికలు పంపేలోపే గత వారం కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు పలుచోట్ల రూపు లేకుండా పోయాయి. ముఖ్యంగా బోసుబొమ్మ రోడ్డు, కొత్త హాలు రోడ్డు, రామలింగపురం, రామమూర్తినగర్ వెళ్లే పలుచోట్ల, ప్రధాన మినీ బైపాస్‌రోడ్డు, నారాయణ హాస్పిటల్‌కు వెళ్లే మార్గం, వేదాయపాలెం రోడ్డు, గాంధీనగర్‌లో రోడ్లు దెబ్బతిన్నాయి. అధికారులు స్పందించి రహదారులకు శాశ్వత మరమ్మతులు చేయాలని నగరవాసులు కోరుతున్నారు. ● కార్పొరేషన్ ఎస్.ఈ రామమోహన్‌రావు స్పందిస్తూ నగర పరిధిలో ర.భ. శాఖ రోడ్ల పరిస్థితిపై ఆ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్పొరేషన్ రోడ్ల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.



మినీబైపాస్‌రోడ్డు దుస్థితి

## ప్రయాణికులకు బహుమతులు అందజేత

**నెల్లూరు(రవాణా), న్యూస్‌టుడే:** ఆర్టీసీ నెల్లూరు రీజియన్ రెండో డిపో పరిధిలో ప్రయాణికులకు బహుమతులను సోమవారం అందజేశారు. డిపో సహాయ మేనేజర్ మురళీ మాట్లాడుతూ రెండో డిపో పరిధిలో ప్రయాణించే వారిని డిప్ ద్వారా ఎంపిక చేసి అక్టోబర్ నెల మొదటి పక్షం కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. లక్కీడిప్‌లో ఎంపికైన కె.మోహన్‌బాబు, తేజ, పి.జయప్రదలకు మొదటి మూడు బహుమతులు అందించారు.

## నగరంలో పోలీసుల ర్యాలీ

**నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే:** పోలీసు అమరవీరుల సంస్మరణ దినంలో సందర్భంగా సోమవారం పోలీసులు నగరంలో ర్యాలీ చేపట్టారు. పోలీసు కవాతు మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీ.. ఆర్టీసీ బస్టాండు వరకు అక్కడ నుంచి తిరిగి మైదానానికి చేరుకుంది. ఎస్పీ జి.కృష్ణకాంత్ జెండా ఊపి ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, పోలీసులు పాల్గొన్నారు.